నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

నిజామాబాద్-కామారెడ్డి

శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com | 1

సన్ ఫ్లవర్‌ను కొనుగోలు చేయాలి

తహసీల్దార్‌కు రైతుల వినతి

నవతెలంగాణ-జుక్కల్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మండలంలోని పలు గ్రామాల సన్ ఫ్లవర్ రైతులు తాము పండించిన పంటలకు ప్రభుత్వ పరంగా కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతు జుక్కల్ తహసీల్దార్ హిమబిందుకు రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా రైతు ప్రశాంత్ మాట్లాడుతూ.. మండలంలో సుమారుగా వేల వేలకరాలలో పొద్దు తిరుగుడు పువ్వు పంటను పండిస్తున్నామని పంట కనుగోలు కేంద్రం లేక దళారులు గ్రామాలలో తిరిగి ఇష్టం వచ్చిన రేట్లు పెట్టి కొనుగోలు చేస్తు రైతులకు సరియైన ధర ఇవ్వకుండా నష్ట పరుస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు కోరారు.

ఉప ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు

నవతెలంగాణ-లింగంపేట్



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్కను శుక్రవారం ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్ రావు కలిశారు. ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృధి పనులో భాగంగా ఎల్లారెడ్డి బస్టాండ్ , ఎల్లారెడ్డి ప్రభుత్వ 100 పడకల ఆసుపత్రి, ఉప్పల్వయి- బాన్స్ వాడ రోడ్, గాంధారి- చద్మల్ రోడ్ కాంట్రాక్టర్ లకు రావలసిన నిధులును వెంటనే విడుదల ఉప ముఖ్యమంత్రి తీసుకొచ్చారు దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. నియోజకవర్గ అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ఆలోచిస్తే మోసాలకు అడ్డుకట్ట

- వినియోగదారుల హక్కుల రక్షణ చట్టం వినియోగించుకోవాలి : జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

నవతెలంగాణ-కామారెడ్డి

అవసరం మేర సాంకేతికతను వినియోగించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగిపోవడం, కృత్రిమ మేధస్సు (అర్టీసిల్ ఇంటెలిజెన్స్) వల్ల స్వతహాగా ఆలోచించే విధానం సన్నగిల్లడంతో పాటు మోసాలు ఎక్కువగా జరిగే అవకాశముందని అన్నారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ ఆన్ లైన్ లో గ్యాంబ్లింగ్ వంటి వివిధ యాప్ ల ద్వారా కుటుంబాలు నాశనమవుతూ, ఆత్మహత్యలకు దారితీస్తున్నాయని, యువత అప్రమత్తంగా యాప్‌లను ఉపయోగించాలని హితవు చెప్పారు. దైనందిన జీవితంలో ఆన్ లైన్, ఆఫ్ లైన్, మాలి లెవెల్ మార్కెటింగ్, ఈ - కామర్స్, తదితర విధానాల ద్వారా వస్తువులు కొనుగోలు చేసి మోసపోతున్న వినియోగదారుల రక్షణకు ప్రభుత్వం 2019 లో వినియోగదారుల రక్షణ చట్టం తెచ్చిందన్నారు. ప్రధానంగా తూనికలు, కొలతలలో మోసాలు, కల్తీ , నాణ్యత లేని వస్తువులు, విక్రయించడం బ్లాక్ మార్కెటింగ్ చేసి అధిక ధరలకు విక్రయిచడం వల్ల మోసపోతు న్నారని అన్నారు. ఈ చట్టం ద్వారా నష్టపోతే పరిహారం పొందే హక్కుతో పాటు వస్తువు ఎంపిక చేసుకునే హక్కు, భద్రత, సమాచారం, విద్య, ఆరోగ్య హక్కులు పొందవచ్చని అన్నారు. వినియోగదారుడు వస్తువు కొనేముందు నాణ్యత, ఎక్స్పైరీ తేదీ, గరిష్ట ధర, వంటివి పరిశీలించి రసీదు తీసుకోవాలని సూచించారు.

డీఎస్ ఓ మల్లికార్జున్ బాబు, జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి, ఫుడ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

ఇన్స్పెక్టర్ సునీత, ఉద్యానవన అధికారి విజయభాస్కర్ మాట్లాడుతూ నేడు తినే ఆహారం తో పాటు ప్రతి వస్తువు కల్తీ అవుతున్నదని, కొన్ని చిట్కాలు పాటిస్తే నకిలీవో కావో తెలుసుకొని అప్రమత్తం కావచ్చని అన్నారు. నేడు గూగుల్, మోనోపాలీగా ఆన్ లైన్ రంగాన్ని శాసిస్తున్నాడని, మన ప్రభుత్వం రూపొందించిన ఓఎన్‌డిసి ప్లాట్ ఫారం, సై ఎ ఆర్ డి ఐ యాప్ ఉపయోగించాలని సూచించారు. అదేవిధంగా అందరు మన దేశ ఉత్పత్తులను ఉపయోగిస్తే డాలరుతో సమానంగా మన రూపాయి వృద్ధిచెంది దేశం ఎంతో పురోగమిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి బావయ్య, పరిశ్రమల కేంద్రం సహాయ సంచాలకులు రఘునందన్, సహాయ పౌర సరఫరాల అధికారి నిత్యానందం, వినియోగదారుల ఫోరమ్ సభ్యులు పాల్గొన్నారు.

మౌనం వెనుక మర్మమేమిటో..?

- బీఆర్ఎస్ కార్యక్రమాలకు దూరంగా ఐడీసీఎంఎస్ చైర్మన్
- త్వరలోనే కాంగ్రెస్‌లో చేరిక..?

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఉమ్మడి జిల్లా ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబరు మోహన్ గత కొన్ని రోజులుగా మౌనంగా ఉన్నారు. బీఆర్ఎస్ కార్యక్రమాలకు అంటిముట్టనట్టుగా ఉంటున్నారు. అయితే కాంగ్రెస్‌లో చేరుతున్నారని ప్రచారం కొనసాగుతోంది. ఇటీవల ఎమ్మెల్యేను భూపతిరెడ్డిని కలవడం.. ఆ ప్రచారాలకు బలం చేకూర్చినట్టయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో రూరల్‌లో బాజిరెడ్డి గోవర్దన్ ఓడిన తర్వాత కొందరు నాయకులు తన పట్ల వ్యవహరించిన తీరుతో ఆ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీ మారేందుకు ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు సమాచారం.

ఉమ్మడి జిల్లాలో సౌమ్యుడుగా పేరొందిన ఉమ్మడి జిల్లాల ఐడిసిఎంఎస్ చైర్మన్ సంబారు మోహన్.. తెలంగాణ రాష్ట్ర మార్క్ ఫెడ్ డైరెక్టర్‌గా, నల్లవెల్లి సహకార సొసైటీ చైర్మన్ గా పదవి బాధ్యతల్లో ప్రస్తుతం ఉన్నారు. గత కొన్ని నెలలుగా పార్టీ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించినా అంటి ముట్టనట్లు దూరం పాటిస్తున్నారు. గత కొన్నేళ్ల క్రితం సామాన్య కార్యకర్తగా ఉంటూ తన పని తను చేసుకుంటూ ఉండేవారు. నాలుగేండ్ల క్రితం నల్లవెల్లి సహకార సొసైటీ ఎన్నికల్లో డైరెక్టర్‌గా ఎన్నికల్లో నిలబడి విజయం సాధించి డైరెక్టర్ల మద్దతుతో చైర్మన్ బాధ్యతలు స్వీకరించారు. నిజామాబాద్ రూరల్ తాజా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ప్రత్యేక చొరవతో ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ పదవి సాంబరి మోహన్‌కు దక్కింది. ఇదే



ఎమ్మెల్యేను కలిసి సన్మానించి పుష్పగుచ్చం అందజేస్తున్న చైర్మన్

కాకుండా తెలంగాణ రాష్ట్ర మార్కెట్ డైరెక్టర్‌గా కూడా కొనసాగుతున్నారు. గత నాలుగేళ్లగా సహకార సొసైటీ పరిధిలో ఎక్కడ వరి కొనుగోళ్లలో ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా లారీలను, హమాలీల గోనెసంచుల కొరత రాకుండా చర్యలు చేపట్టారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సౌమ్యుడు గానే పేరుగాంచారు. ఆనాడు నేరుగా ముఖ్యమంత్రి వద్దకు వెళ్లే స్థాయి వరకు వెళ్లారు.

కానీ గత కొన్నేళ్ళుగా రూరల్ నియోజకవర్గం లో పార్టీ కార్యక్రమాలైనా, అధికారిక కార్యక్రమాలైన శిలఫలకాలపై పేరు లేకపోవడం ఒకానొక దశలో బాధపడ్డ సంఘటనలు లేకపోలేదు. ఆనాటి నుండి నేటి వరకు బిఆర్ఎస్ పార్టీ కి విధేయుడుగా ఉంటూ వచ్చారు. నియోజకవర్గంలో కొందరు నాయకుల తీరు ఇబ్బందులు కలిగించినట్లు గతంలోనూ వాపోయారు. బిఆర్ఎస్ రాష్ట్రం లో అధికారం కోల్పోయింది. నిజామాబాద్ రూరల్‌లో బాజిరెడ్డి గోవర్ధన్ ఓడిపోవడంతో ఎవరికి ఏం చెప్పాలో తోచక మిన్న కుండిపోయారు. బిఆర్ఎస్ పార్టీలో ఉంటే తనకు ప్రోటోకాల్ ప్రకారం దక్కే మర్యాద దక్కదనే ఉద్దేశంతో కాంగ్రెస్ వైపు చూస్తున్నట్టు తెలిసింది. గత కొన్ని రోజులుగా తన సన్నిహితులు, మిత్రులు, సొసైటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలు ధఫాలు చర్చలు జరిపి వారి సూచనలు సలహాలు తీసుకుంటున్నట్టు సమాచారం. అందరి అభిప్రాయం మేరకు పార్టీ మారాలని సాంబార్ మోహన్ పై తీవ్ర ఒత్తిడి తెస్తున్నట్టు తెలిసింది. దానిలో భాగంగానే గురువారం నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పూల బోకేతో సన్మానించారు.

కానీ ఇప్పటికీ తను పార్టీ మారేది లేదని, కానీ కొందరు నాయకులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు, అవమానాలకు గురి చేశారని, తనపై చిన్నచూపు చూడడమే కాకుండా రూరల్ నియోజకవర్గంలో కనీసం మర్యాద కూడా ఇవ్వలేదని,తన మనస్సు కు గాయపరిచిందని, అలాంటి పార్టీలో ఉంటే మళ్ళీ కొందరిదే రాజ్యం ఉంటుందని, దాని కోసమే పార్టీ మారక తప్పదనే నిర్ణయానికి వచ్చినట్లు అత్యంత సన్నిహితంగా ఉండే మిత్రులు "నవ తెలంగాణ"కు వివరించారు.

త్వరలోనే కాంగ్రెస్ గూటికి

బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరడానికి ముహూర్తం ఫిక్స్ చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఈయన చేరికతో నియోజకవర్గమే కాకుండా ఉమ్మడి జిల్లాల్లో కాంగ్రెస్ పార్టీకి బలం చేకూరనుందని, వచ్చే లోక్ సభ ఎన్నికల్లో ఎంతగానో తోడ్పాటవుతుందని, కాంగ్రెస్‌లో చేరడానికి సాంబార్ మోహన్‌కు కాంగ్రెస్ లో ప్రస్తుతం ఉన్న నాయకులు, కార్యకర్తలు ఎవరూ ఎలాంటి వ్యతిరేక వ్యక్తం చేయడంలేదని సమాచారం.

పోలీస్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని పరమల్ల ఉన్నత పాఠశాలలో శుక్రవారం 10వ తరగతి విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో పరీక్ష అట్టలు అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సందీప్ కుమార్ తెలిపారు. భయాందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. అట్టలు పంపిణీ చేసిన లింగంపేట్ పోలీస్ శాఖ వారికి ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బృందం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్

- కుట్రలో భాగమే అరెస్టు : బీఆర్ఎస్ శ్రేణుల నిరసనలు



నిజామాబాద్‌లో మోడీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్/ధర్పల్లి/నిజామాబాద్

లిక్కర్ స్కామ్ కేసులో నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అయ్యారు. శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని కవిత నివాసంలో ఈడీ అధికారుల బృందం ముందుగా ఆమెకు సెర్చ్ వారంట్ జారీ చేశారు. ఆ తర్వాత ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించారు. ఆరు గంటల సోదాల అనంతరం ఆమెను అరెస్ట్ చేశారు. కవిత అరెస్టు పట్ల నిజామాబాద్ జిల్లా కేంద్రంలో పలువురు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. జాగృతి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ చౌరస్తాలో మోడీ దిష్టిబొమ్మను దహనం చేశారు. సీబీఐ, ఈడీని మోడీ జేబు సంస్థగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. న్యాయమే గెలుస్తుందని అన్నారు.

బీజేపీ కుట్రలో భాగమే : ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి

ధర్పల్లి : బీజేపీ పార్టీ పన్నిన కుట్రలో భాగమే ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని ఎంపీపీ నల్ల సారిక హన్మంత్ రెడ్డి అన్నారు. శుక్రవారం సాయంత్రము ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల వేళ రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ఇబ్బందులకు గురిచేయదని మాత్రమే బీజేపీ ఈపన్నాగం పన్నిందని విమర్శించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ అనేది పెద్ద కుట్ర అని యావత్ దేశ ప్రజలందరికి తెలిసిన నగ్న సత్యమని అన్నారు. ఎవరేమనుకున్నా మాకేంటనే ధోరణిలో బీజేపీ పరిపాలిస్తుందని విమర్శించారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-కామారెడ్డి

తెలంగాణ మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గల మైనారిటీ స్టడీ సర్కిల్ హైదరాబాద్ శిక్షణ కేంద్రంలో యూపీఎస్సీ సీశాట్ 2024-25 సంవత్సరానికి ఉచిత శిక్షణ ఇవ్వనుందని, ఈ మేరకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి దయానంద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యూపీఎస్సి, సీశాట్ శిక్షణకు (100) మంది డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీ (ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైను, బుద్దిష్ట్, పార్సీ) అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నదని, రిజర్వేషన్ల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33 శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరిలో వికలాంగులకు 3 శాతం సీట్లు కేటాయించినట్టు తెలిపారు. అభ్యర్థులు ఇతర విద్యాసంస్థల్లో ఏ రకమైన కోర్సు, ఉద్యోగం చేయకుండ, కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షలకు మించి ఉండరాదని, (www.tmreistelangana.cgg.gov.in) వెబ్ సైట్ నందు ఏప్రిల్ 12 వరకు దరఖాస్తు చేసుకావాలని ఆయన సూచించారు.

మైనారిటీ సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు స్క్రీనింగ్ టెస్ట్ తేది: 28.04.2024 (ఆదివారం)న ఉ. 10.30 గం. నుండి మ.12.30 ల వరకు తెలంగాణ మైనారిటి గురుకుల బాలుర పాఠశాల కామారెడ్డి నందు నిర్వహించనున్నట్టు తెలిపారు. పూర్తి వివరాలకు 040-23236112 నంబర్‌నకు సంప్రదించవలసినదిగా దయానంద్ సూచించారు.

వివాదాస్పద స్థలం పరిశీలన

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రంలోని చాముండేశ్వరి ఆలయం ఎదురుగా ఉన్న వివాదాస్పద ఖాళీ స్థలాన్ని డీఎల్‌పీవో శ్రీనివాస్, అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమకొండ గ్రామానికి చెందిన రవీంద్రర్ రెడ్డి ఇంటినెంబర్ 8-37 గల దానిలో 1151 గజాల స్థలం రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్ లతో ఇంటి నిర్మాణం కోసం గత కొన్ని నెలల క్రితం దరఖాస్తు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చేసుకున్నారని, స్థలం అమ్మకం దారుడు తన స్థలన్ని తప్పుడు రిజిస్ట్రేషన్ డాక్యూమెంట్ లు సృష్టించి తయారు చేసి స్థలాన్ని కబ్జా చేశారని ఆరోపిస్తూ జడ్పీటీసీ గత కొన్ని రోజుల క్రితం జిల్లా కలెక్టర్, డీపీవో కు పిర్యాదు చేశారు. పిర్యాదు మేరకు వివాదాస్పద ఖాళీ స్థలాన్ని, గ్రామ పంచాయతీ రికార్డులను డీయల్పీవో శ్రీనివాస్ పరిశీలించారు.

రైతన్నకు గ్రోమోర్ కుచ్చుటోపి

- ఒక రకం వంగడం బదులు మరొక వంగడం అప్పగింత
- కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన

నవతెలంగాణ-కోటగిరి

కోటగిరి మండల కేంద్రంలోని గ్రోమోర్ ఆఫీస్ ఎదుట శుక్రవారం రైతులు ఆందోళన నిర్వహించారు. గంగా కావేరి సంబంధించిన వరి వంగడానికి బదులు ఆర్కే సోనారకం వరి విత్తనాలను ఇవ్వడంతో ఇప్పటివరకు పొలం పాలు పోసుకోకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు ఆత్మహత్యనే శరణ్యం అంటూ వాపోయారు. 15 రోజుల క్రితం పంట పాలు పోసుకోవడం లేదని ఫిర్యాదు చేసినప్పటికీ, నిర్లక్ష్య సమాధానం ఇచ్చారని, కౌలుకు చేసిన పొలం ఏమవుతుందోనని ఆందోళన వ్యక్తం చేశారు. పోతంగల్ మండలంలోని దోమలేడ్గి గ్రామానికి చెందిన రైతు తుకారాం గౌడ్ ఇదే విషయాన్ని గ్రోమోర్ సభ్యులకు తెలిపినప్పటికీ సమాధానం ఇవ్వడం లేదని ఆరోపించారు. రైతుల పరిస్థితిని ఆసరాగా తీసుకొని త్వరిత కాలంలో పంటకు వచ్చే సన్న రకం బదులు లేటుగా వచ్చే వరి వంగడాలను వాళ్లకి తెలుపకుండా ఇచ్చారని, గాండ్ల గంగారం



గ్రోమోర్ ఎదుట ఆందోళన చేసి ఏవోతో మాట్లాడుతున్న రైతులు

రైతు పరిస్థితి విషాదకరంగా మారిందని వాపోయారు. పొలంలోకి నీరు లభించడం దుర్లభంగా మారిందని, ప్రాముఖ్యత ఉన్న కంపెనీ గ్రోమోరని వెళితే తమకు తెలియకుండా, తాము అడిగింది ఇవ్వకుండా వేరే రకం వంగడం ఇచ్చి నట్టేట ముంచారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై రైతులకు నష్టపరిహారం చెల్లించాలని రైతుల డిమాండ్ చేశారు. సిబ్బంది దాటవేసే ధోరణి అవలంభించడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోకపోవడం పట్ల ఏవో శ్రీనివాసరావు గ్రోమోర్ కంపెనీ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పొలాలు పరిశీలించడం లేదని , పొలాలు పరిశీలిస్తే ఏ రకమైన సమస్యలు రావనీ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా విత్తన షాపుల్లో వరి వంగడాలను పరిశీలించి రైతులకు అవగాహన కలిగిస్తే ఇటువంటి నష్టం రాదని రైతులు పేర్కొన్నారు. గాండ్ల గంగారం వరి విత్తనాలు కొన్నటువంటి రసీదును ఏవో శ్రీనివాసరావుకి చూపించారు. తాము అడిగింది ఒకటి వాళ్ళు ఇచ్చింది మరొకటి ఈ విధంగా ఎంతమందిని మోసం చేశారని రైతులందరూ ఏవో శ్రీనివాసరావు ను నిలదీశారు. ఏవో శ్రీనివాసరావు దాటవేసే ధోరణిలో మాట్లాడటంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రోమోర్ సంస్థకి సమర్థించే విధానములో ఏవో మాట్లాడడంపై రైతులు మండిపడ్డారు. ఈ రకం విత్తనాలను ఎంతమందికి ఇచ్చారని వెంటనే సమాచారం ఇవ్వాలని లేనియెడల చర్యలు తీసుకుంటామని ఏవో హెచ్చరించారు. ఈ విషయాన్ని పై అధికారులకు తెలియజేయడంతో ఈనెల 18వ తేదీనా గ్రోమోర్ సమస్త ప్రతినిధులు, ఆర్కే సోనా కంపెనీ ప్రతినిధులు వస్తున్నారని ఏవో తెలపడంతో రైతులు శాంతించారు. అనంతరం రైతు వేదికలు ఏవో శ్రీనివాసరావుకి రైతులు గ్రోమోర్ ద్వారా వరి వంగడాలను కొన్న రసీదులను అందజేశారు.

మీర్జాపూర్ సొసైటీ చైర్మన్‌పై అవిశ్వాసం



అవిశ్వాసం పెట్టాలని వినతిపత్రం అందజేస్తున్న డైరెక్టర్‌లు

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్ సొసైటీ చైర్మన్ మారుతి పటేల్ పై అవిశ్వాసం తీర్మానం పెట్టాలని 9 మంది పాలకవర్గ సభ్యులు తీర్మానించారు. సొసైటీ పాలకవర్గ సభ్యులు జిల్లా అధికారులను కలసి వినతిపత్రం అందజేసినట్లు సంఘం సభ్యులు తెలిపారు. మిర్జాపూర్ సహకార సంఘంలో 13 మంది ఉండగా ఇందులో బీఆర్ ఎస్ పార్టీకి చెందిన మారుతి పటేల్ చైర్మన్ అయ్యారు. ప్రస్తుతం ఇందులో 10 మంది సొసైటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ చేరి సంఘం అధ్యక్షుడు పై అవిశ్వాసం పెట్టాలని తీర్మానించారు. గతంలో 13 మంది సొసైటీ సభ్యులు బీఆర్ఎస్ పార్టీ మద్దతుతో గెలవగా ఒకరు రాజీనామా చెయ్యగా 12 మంది సభ్యుల్లో ప్రస్తుతం ఇందులో 9 మంది బాన్సువాడ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఏనుగు రవీందర్‌రెడ్డి సమక్షంలో చేరారు. ఈ నేపథ్యంలో సొసైటీ డైరెక్టర్లు ప్రత్యేక సమావేశమై అవిశ్వాస నోటీసు అందజేసినట్లు సమాచారం. 9 మంది సభ్యుల్లో రాంబాబు, నారాయణ చైర్మన్ పోటీలో ఉన్నట్లు సమాచారం. పలు డైరెక్టర్లతో క్యాంప్ లో ఉన్నట్లు వినికిడి. దీంతో గ్రామంలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. బీ ఆర్ ఎస్ పార్టీకి కంచుకోటలాగా ఉన్న మీర్జాపూర్ గ్రామంలో పలువురు నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడంతో గ్రామంలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి.

నిజామాబాద్‌లోనే పసుపు బోర్డు కార్యాలయం

- ఎంపీ అరవింద్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

జాతీయ పసుపు బోర్డు కార్యాలయం నిజామాబాద్ లోనే ప్రారంభం అవుతుందని నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ అన్నారు. శుక్రవారం మండలంలోని చౌట్‌పల్లిలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనంలో నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ పాల్గొని మాట్లాడారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పసుపునకు మద్దతు ధర రోజు రోజుకి పెరుగుతుందని, పసుపు రైతులు సంతోషం వ్యక్తం చేయడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎంపీ అరవింద్

భవిష్యత్తులో పసుపునకు క్వింటాలుకు రూ.20 వేలకు పైగా ధర లభిస్తుందని అన్నారు. పసుపు బోర్డు ఏర్పాటుతో పసుపు పండించే రైతులకు మంచి రోజులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఏలేటి మల్లికార్జున్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల శ్రీనివాస్, బాల్కొండ అసెంబ్లీ కన్వీనర్ మల్కాన గారి మోహన్, కమ్మర్ పల్లి మండల బీజేపీ అధ్యక్షులు కట్ట సంజీవ్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శిథిలావస్థలో స్కూల్

- పెచ్చులూడిపోతున్న భవనం శ్లాబ్
- ఆందోళనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



పెచ్చులూడుతూ శిథిలావస్థకు చేరిన స్కూల్

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెచ్చులూడిపోతున్న పైకప్పు.. వర్షం వస్తే కారిపోతున్న భవనం.. ఆరుబయట నిలిచిపోతున్న నీరు.. ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థుల్లో భయం.. ఇదీ మండలంలోని విట్టల్‌వాడి ప్రాథమిక పాఠశాల దుస్థితి. మన ఊరు మన బడి పథకంలో విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నామని పాలకులు గొప్పలు చెబుతున్నా విట్టల్వడి పాఠశాలను మాత్రం పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాలలో 40 మంది విద్యార్థులు చదువుతున్నారు. రెండు గదుల ఈ పాఠశాల భవనం శ్లాబ్ పెచ్చులూడి పడిపోతున్నాయి. పిల్లలు గాయాలపాలవుతారేమోనని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షం వస్తే భవనం కారిపోతుంది. భవనం గోడలు నానిపోతున్నాయి. వర్షపు నీరు బయటకు వెళ్లేందుకు సదుపాయం లేకపోవడంతో నీరంతా స్కూల్ ఆవరణలో నిలిచిపోతుంది. దీనికి తోడు సగానికి పైగా ప్రహరీ గోడ దెబ్బతినడంతో పశువులు, కుక్కలు, పందులు పాఠశాల ఆవరణలో సంచరించడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ పాఠశాలకు మరమ్మతులు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పక్షవాతానికి గురైన బాధితుడికి ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-బిచ్కుంద



ఆర్థికసాయం అందజేస్తున్న బండివార్ విజయ్

బిచ్కుంద మండలంలోని తుబ్దాల్ గ్రామానికి చెందిన మోడే శంకర్ గత కొంత కాలంగా పక్షవాతానికి గురై లేవలేని స్థితిలో ఉన్నాడు. తల్లిదండ్రులు చనిపోవ డంతో బిచ్కుంద లో నివాసం ఉంటున్న తన సోదరి వద్ద ఉంటున్నారు. మంచం పై నుండి లేవలేని స్థితిలో ఉన్న శంకర్‌కు నిరుపేదరాలైన సోదరి సపర్యాలు చేస్తున్నారు. పెద్ద ఆస్పత్రిలో శంకర్ కు చికిత్సలు నిర్వహించాలన్నా. పూట గడవని స్థితిలో ఉండి ఆర్థిక స్థోమత లేకపోవడం కూలి పని చేసుకుని జీవనం కొనసాగిస్తున్న సోదరీ అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. శంకర్ అనారోగ్య విషయం తెలుసుకున్న మద్నూర్ మండల కేంద్రానికి చెందిన బండివార్ విజయ్ ముందుకు వచ్చి చికిత్స, మందుల నిమిత్తం 20 వేల ఆర్థిక సాయం అందించారు. బిచ్కుంద మండల కేంద్రానికి చెందిన సుభాష్ 2 వేల ఆర్థిక సాయం అందించగా ఈ విషయం తెలుసుకున్న గ్రామ యువకులు తలా కొంత పోగుచేసి మొత్తం 40 వేల రూపాయల వరకు ఆర్థిక సాయం అందజేశారు. పక్షవాతానికి గురైన నిరుపేద శంకర్ కు చికిత్స నిమిత్తం ఆర్థిక సాయం అందించాలని శంకర్ సోదరి, చుట్టుపక్కల వాళ్ళు వేడుకుంటున్నారు.

ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు సమావేశం శుక్రవారం నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ సత్యవతి తెలిపారు. అందులో భాగంగా విద్యార్థుల భవిష్యత్తు దృష్టిలో ఉంచుకొని పలువురు ప్రముఖులచే "కెరీర్ గైడెన్స్"పై స్ఫూర్తిదాయకమైన ప్రసంగాలు ఇప్పించారు. ఈ కార్యక్రమంలో నవోదయ తెలుగు టీచర్ శ్యాం ప్రసాద్, సైకాలజిస్ట్ టీచర్ రమేష్, మనకోసం మనం ఫౌండేషన్ ఫౌండర్ కిషోర్, మండల వైద్యాధికారి డాక్టర్ రోహిత్, నిజం సాగర్ పోలీస్ సిబ్బంది, ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కాన్సీరాం జయంతి


నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

నిజామాబాద్ రూరల్ మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో శుక్రవారం బహుజన మేధావి, బహుజనుల ఆశజ్యోతి, బహుజన రాజ్యాధికార పితామహులు మాన్యశ్రీ కాన్షిరాం జయంతి సందర్భంగా కాన్షిరాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బహుజన నాయకులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, యువజన సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నూతన కమిటీ ఎన్నిక


ఎన్నికైన నూతన కమిటీ

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బడాభీంగల్ గ్రామంలో అంబేద్కర్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చిత్తరి రాజేశ్వర్(కాలే), ప్రధాన కార్యదర్శిగా కొండూరి గంగాధర్, కోశాధికారిగా చిత్తరి ఆనంద్, రైటర్‌గా కొండూరి నవీన్‌ను సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం, సంఘం అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తామని, నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు అన్నారు. కార్యక్రమంలో ప్రదీప్, సుమన్, సూర్యం, గిరిదాస్, సురేష్, రఘు, ఉదయ్, శంకర్, సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీరు శుద్ధి కేంద్రం సందర్శన


మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఖానాపూర్ రోడ్‌లో ఉన్న భూగర్భ మురుగు నీటి శుద్ధి కేంద్రాన్ని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ శుక్రవారం సందర్శించారు. యంత్రాల పరిశీలన, మురుగు నీటి శుద్ధికరణ పరిశీలించి ఆయన మాట్లాడుతూ.. దుబ్బ ఎస్టీపీ-1 31.5 ఎంఎల్డీ సామర్థ్యం గల ప్రాజెక్టుకు అమృత్ పథకం-1 ద్వారా అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ 30 కోట్లు, వాటర్ సప్లై 98 కోట్లు ఖర్చుతో 2017లో ప్రారంభం అయ్యి, 2020 పూర్తి చేశారని, అయినప్పటికీ గత ప్రభుత్వం, ఎమ్మెల్యే నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు నాగోళ్ళ లక్ష్మి నారాయణ, అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నగేష్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజనీర్ యోగేష్, కార్పొరేటర్స్ పంచారెడ్డి ప్రవళిక శ్రీధర్, ఎర్రం సుదీర్, ఇల్లేందుల మమతా ప్రభాకర్, సవిత రాజు, బీజేపీ నాయకులు, భాస్కర్ శివునిరి, మఠం పవన్, అంతిరెడ్డి హరీష్‌రెడ్డి, బట్టికిరి ఆనంద్, కృష్ణ మారవర్, సాయిరామ్, రంజిత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవం


కిడ్నీ దినోత్సవ వేడుకల్లో వైద్యులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్లో అంతర్జాతీయ కిడ్నీ దినోత్సవాన్ని ఆస్పత్రి సిబ్బంది కేక్ కట్ చేసి వేడుకగా జరుపుకున్నారు. తరువాత ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం మార్చి నెల 2వ గురువారం కిడ్నీ దినోత్సవం జరుపుకుంటున్నట్టు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా మూత్రపిండాల ప్రాముఖ్యతను అలాగే మూత్రపిండ సంబంధిత ఆరోగ్య సమస్యలపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఈ కిడ్నీ దినోత్సవాన్ని 2006లో ప్రారంభించారని తెలిపారు. ఈ సందర్భంగా రోగులందరు, సౌకార్యాలు బాగున్నాయని సూపరింటెండెంట్‌కు వైద్యులకు ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో డా.హరికృష్ణరెడ్డి, డా.మను, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ


విద్యార్థులకు పరీక్ష అట్టలు పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

నవతెలంగాణ-బోధన్

"వర్క్ టు సర్వ్ ఫర్ ది నేషన్" అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ పట్టణంలోని రాకాసిపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (జేసీ)లో వర్క్ టు సర్వ్ ఫర్ ది నేషన్ అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సంస్థ అధ్యక్షులు నవీన్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష అట్టలను పంపిణీ చేశారు. తెలుగు, ఉర్దూ, ఇంగ్లీష్ మీడియానికి చెందిన సుమారు 100 మంది విద్యార్థులకు ఆయన పెన్నులు, పరీక్ష అట్టలను, స్కేల్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ముందుకు సాగాలని వెనకడుగు వేయవద్దని సూచించారు. పరీక్షలు అంటే భయం ఉండవద్దని జయమే లక్ష్యంగా పరీక్షలకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలచంద్రం, ఉపాధ్యాయులు నగేష్‌బాబు, ఖైరాన్, సుధాకర్‌రెడ్డి, రాచప్ప, రాజేశ్వర్ మహిళ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్‌లో నిర్మాణ కార్మికులకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇజ్రాయెల్‌లో నిర్మాణ కార్మికులు షట్టరింగ్ కార్పెంటర్‌లు, సిరామిక్ టైలింగ్, ప్లాస్టరింగ్, ఐరన్ బెండింగ్‌గా పనిచేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి సిరిమల శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు నెలకు ఇండియన్ రూపాయలు 1,20,000-1,38,000 జీతం ప్యాకేజీతో చెల్లిస్తారని పేర్కొన్నారు. ఉద్యోగ పాత్రల కోసం దరఖాస్తు చేయడానికి అభ్యర్థులు తప్పనిసరిగా ఎస్ఎస్సి (పదవ తరగతి) ఉత్తీర్ణులై, కనీసం 3 సంవత్సరాల అనుభవం ఉండి వయస్సు 21-45 సంవత్సరాల మధ్య ఉండాలని, ఉద్యోగాల కోసం అభ్యర్థులు వారి వివరాలను జిల్లా ఉపాధి కార్యాలయంలో మార్చి 16 వరకు నమోదు చేసుకోవాలని తెలిపారు. నమోదు చేసుకున్న అభ్యర్థులకు మార్చి 31 నుంచి ఏప్రిల్ 3వరకు హైదరాబాద్‌లోని నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్‌లో టాంకాం ఆధ్వర్యంలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే నమోదు చేసుకున్నవారు మళ్లీ నమోదు చేసుకోనవసరం లేదని తెలిపారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు పాటుపడాలి

- అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం సంబంధిత శాఖల అధికారులు అంకిత భావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో పౌర సరఫరాల శాఖ, సివిల్ సప్లైస్ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వినియోగదారుల హక్కులు, బాధ్యతలను తెలియజేస్తూ, చట్ట పరిధిలో ఎలాంటి సేవలు పొందవచ్చు, వస్తు, సేవలలో మోసాలు ఎదురైనప్పుడు ఎవరికి ఫిర్యాదు చేయాలి తదితర వివరాలతో వినియోగదారులను చైతన్యపరిచేందుకు వీలుగా ఆర్మూర్ మండల వినియోగదారుల సంఘం ముద్రించిన కరపత్రాలను అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇటీవలే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ ప్రతినిధులను సైతం రప్పించి వివిధ రకాల వస్తువుల నాణ్యత, వాటి ప్రమాణాల గుర్తింపు తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని గుర్తు చేశారు. వినియోగదారుడు తన హక్కులు, బాధ్యతలను తెలుసుకున్నప్పుడే నాణ్యమైన వస్తువులు, సంతృప్తికర సేవలు పొందేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. ఒకవేళ ఏదైనా సందర్భంలో మోసాలకు గురైతే న్యాయం పొందేందుకు వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు దోహదపడతాయని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రభుత్వ శాఖల అధికారులు వినియోగదారులకు వారి హక్కులు, బాధ్యతల పట్ల అవగాహన పెంపొందించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. నేటి రోజుల్లో అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో నాణ్యమైన వస్తువులు, సేవలను గుర్తించేందుకు గల అవకాశాలను తెలియజేయాలన్నారు. కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా వినియోగించుకుంటే అనేక ప్రయోజనాలు పొందవచ్చుని, అదే సమయంలో కృత్రిమ మేధ దుర్వినియోగమైతే దుష్పరిణామాలు కూడా తీవ్రస్థాయిలోనే ఉంటాయని అన్నారు. ఈ నేపథ్యంలో వినియోగదారులు తమ హక్కుల పరిరక్షణ కోసం న్యాయపరమైన, బాధ్యతా యుతమైన కృత్రిమ మేధస్సు సహకారం పొందేలా చైతన్యపరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీ.ఎస్.ఓ చంద్రప్రకాష్, సివిల్ సప్లయిస్ డీ.ఎం జగదీశ్, డీ.ఈ.ఓ దుర్గాప్రసాద్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ సుదర్శనం, తూనికలు-కొలతల శాఖ అధికారి నిర్మల్ కుమార్, ఔషధ నియంత్రణ అధికారిణి శ్రీలత, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు ఎం.రాజేశ్వర్, గుజ్జ రాజేశ్వరి, రేషన్ డీలర్లు, వినోయోగదారుల సంఘాల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

అభ్యర్థులకు ఉచిత కోచింగ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు యూపీఎస్సీ, సిఎస్ఏటి-2025 పరీక్ష కోసం 2024-2025 విద్యా సంవత్సరంలో (100) మైనారిటీస్ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, పార్సిలు) అభ్యర్థులకు ఉచిత కోచింగ్‌ను నిర్వహిస్తోందని, ఈ శిక్షణకు రిజర్వేషన్ల నియమం ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, అన్ని రిజర్వ్ కేటగిరీలలో వికలాంగులకు 3శాతం సీట్లు కేటాయించనున్నట్టు కె.కృష్ణవేణి, జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి, నిజామాబాద్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులందరూ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రవేశం పూర్తిగా మెరిట్ ప్రాతిపదికన ఉంటుందని పేర్కొన్నారు.

యుపిఎస్సి (సిఎస్ఏటి-2025) సివిల్ సర్వీసెస్ ఆప్టిట్యూడ్ టెస్ట్‌లో ప్రవేశం కోసం తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలలోని సాధారణ/ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన మైనారిటీస్ అభ్యర్థుల ద్వారా తేది. 15-03-2024 నుంచి ఆన్ లైన్ www.tmreistelangana.cgg.gov.in వెబ్ సైట్ ద్వారా దరఖాస్తులు స్వీకరించనున్నట్టు పేర్కొన్నారు. చివరి తేదీ 12-04-2024 అని తెలిపారు. ప్రవేశ పరీక్షా తేదీ 28-04-2024 (ఆదివారం)న ఉంటుందని, అన్ని జిల్లా కేంద్రాల్లో గల తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. అర్హులైన ఆసక్తి కలిగిన మైనారిటీస్ విద్యార్థులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కె.కృష్ణవేణి, జిల్లా మైనారిటీస్ సంక్షేమ అధికారి నిజామాబాద్ తెలియజేశారు. వివరాలకు 040-23236112 కార్యాలయ పనివేళలో సంప్రదించాలని సూచించారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-భీంగల్

మండలంలోని బడా భీంగల్ గ్రామ ఎంపీటీసీ 2 కేతావత్ సంతాలి, ఆమె కుమారుడు వల్లి శుక్రవారం బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ప్రజలు కోరుకున్న పరిపాలనతో పాటు రాష్ట్రంలో అభివృద్ధి కాంగ్రెస్ పాలనతోనే జరుగుతుందని ఎంపీటీసీ అన్నారు. మండలంలో సునీల్‌రెడ్డి నాయకత్వంలో నిరంతరం పనిచేస్తానని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బోదిరె స్వామి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు గోపాల్ నాయక్, సేవాలాల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టా భూములకు తక్షణమే కబ్జా చూయించాలి

- సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు పి.రామక్రిష్ణ

నవతెలంగాణ-ధర్పల్లి

ప్రభుత్వం ఇచ్చిన పేదల పట్టా భూములకు తక్షణమే కబ్జా చూయించాలని లేదంటే పెద్ద ఎత్తున పేదలతో ఆందోళనలకు పూనుకుంటామని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ (ప్రజాపంథా) రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ప్రాజెక్టు రామడుగు గ్రామంలో సర్వే నెంబర్ 1150లో 250 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీకి చెందిన పేదలతో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ మాలతీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అప్పటి ప్రభుత్వం ప్రాజెక్టు రామడుగులో రెవిన్యూ భూమిని పలుదఫాలుగా సర్వే నిర్వహించి పేదలకు పట్టాలు ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వం సిఎల్‌డిపి పథకం కింద భూమి అభివృద్ధి కోసం నిధులను వెచ్చించిందని తెలిపారు. ఈ నిధులతో అధికారులు పట్టాలు ఇచ్చిన లబ్ధిదారులకు అనుగుణంగా భూమిని చదును చేసి ప్రభుత్వ నిధులతో అభివృద్ధి చేసి, ఒడ్లు పోసి పంటల సెద్యానికి అనుగుణంగా చదును చేసిందన్నారు. పంటలు వేసుకుందామనే ప్రయత్నం చేస్తుంటే అటవీ శాఖ అధికారులు పట్టాలు ఇచ్చిన నిరుపేదల భూమిని తమదంటూ పేదలను అడ్డుకుంటున్నారన్నారు. ఎలాంటి ఆస్తిపాస్తులు లేని నిరుపేదలు ప్రభుత్వం ఇచ్చిన భూమిలో పంటలు వేసుకుందామన్న అటవీశాఖ అధికారులు అడ్డుకోవడం శోచనీయమని తెలిపారు. కార్యక్రమంలో పివైఎల్ జిల్లా అధ్యక్షులు అనిస్, మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆర్మూర్ డివిజన్ నాయకులు ఆర్.దామోదర్, యం.లింబన్న, బి.కిషోర్, మండల నాయకులు రమేష్, ఎస్.కిషోర్, టి.ఆశన్న తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

జిల్లా ఉత్తమ పీఈటీగా పురాస్తు సువర్ణ



మెండోటోను అందుకుంటున్న సువర్ణ

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

మండలంలోని కస్తూర్బా పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న పురాస్తు సువర్ణను ఉత్తమ పిఈటిగా ఎంపికవడంతో జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్ చేతుల మీదుగా అందుకున్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు అందజేత

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం పెన్నులు, పరీక్ష ప్యాడ్లను అందజేశారు. నిర్మల్ జిల్లా బాసర వాస్తవ్యులు సాయినాథ్ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా బాసర సరస్వతి అమ్మవారి వద్ద పూజించిన పరీక్ష ప్యాడ్, పెన్నులను పదో తరగతి విద్యార్థుల కోసం అందజేశారు. వాటిని పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సక్కారం అశోక్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బాజన్న, ప్రధానోపాధ్యాయులు కనక గంగాధర్ చేతుల మీదుగా పదవ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల్లో మంచిగా చదివి, పరీక్షలను బాగా రాయడం ద్వారా ఉత్తమ గ్రేడ్లు సాధించాలన్నారు. మండల, జిల్లా స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించడం ద్వారా గ్రామానికి, కన్న తల్లిదండ్రులకు, పాఠశా లకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ఇష్టంతో కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్ఎంసి చైర్మెన్ నిరాడి సాయన్న, మాజీ ఉప సర్పంచ్ విక్రమ్, నాయకులు బైకన్ మహేష్, బందెల రాజు, రాజేందర్, ఉపాధ్యాయులు మధుసూధన్, రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.


అందజేసిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులతో విద్యార్థులు

ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి

- ఎంపీవో చందర్


స్పెషల్‌డ్రైవ్‌లో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-వర్ని

ఇంటి పన్నులు చెల్లించి గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని ఎంపీవో చందర్ అన్నారు. శుక్రవారం మండలంలోని జాకోరా గ్రామంలో ఇంటి పన్నులు ప్రత్యేక బృందం ద్వారా పన్ను వసూల్లు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీవో చందర్ మాట్లాడుతూ.. మండలంలోని ఇప్పటి వరకు 9గ్రామాలలో 100శాతం ఇంటి పన్నులు వసూల్లు అయినట్టు తెలిపారు. కార్యక్రమంలో జీపీ సెక్రటరీలు, ప్రజలు ఉన్నారు.

మామిడిపల్లిలో గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు


టీకాలు అందజేస్తున్న పశువైద్య అధికారి

నవతెలంగాణ-ఆర్మూర్

ఉచిత గాలికుంటు టీకాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో 650 గేదె జాతి, గోజాతి పశువులకు గాలికుంటు వ్యాధి రాకుండా, నివారణ చర్యల్లో భాగంగా గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు అందజేసినట్టు మండల పశు వైద్య అధికారి లక్కం ప్రభాకర్ తెలిపారు. మామిడిపల్లి గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని, ప్రతీ పాడి రైతు దగ్గర ఉన్న పశువుల వద్దకు ఇంటింటికీ వెళ్ళి టీకాలను అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తీర్పు చిన్న రాజన్న, లక్కారం నరేష్, సల్ల చిన్న రాజన్న, ప్రవీణ్, శ్రావణ్, పశువైద్య సిబ్బంది రాజేశ్వర్, శ్రీనివాస్‌గౌడ్, రాధ, దివ్య, నాగార్జున, గోపాలమిత్రలు సురేష్, రాజన్న పాల్గొన్నారు. నేడు పెర్కిట్, కోటర్మూర్‌లలో గల పాడి రైతులు, పశు పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఎన్నికల అధికారుల నియామకం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్ అసోసియేషన్ హాల్‌లో సరసం చిన్నారెడ్డి అధ్యక్షతన జరిగిన సర్వసభ్య సమావేశంలో 2024-25 సంవత్సరానికి గాను ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులుగా గటాడి ఆనంద్, తాళ్ల శ్రీనివాస్‌ను శుక్రవారం నియమించినట్టు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అయినారి అశోక్, ఉపాధ్యక్షులు జగన్, కోశాధికారి అరుణ్, సంయుక్త కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, సీనియర్ న్యాయవాదులు లోక భూపతిరెడ్డి, కృష్ణ పండిత్, తులసీదాస్ క్రాంతి, చిలుక కిష్టయ్య, రుయ్యాడి రాజేశ్వర్, జక్కుల శ్రీధర్, బేతు జగదీష్, కృష్ణం రాజు, చిలుక సుభాష్‌కుమార్ జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత


సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఇన్చార్జి ఏఎస్ఐ

నవతెలంగాణ-రెంజల్

పోలీస్‌స్టేషన్ పరిధిలో పోగొట్టుకున్న సెల్‌ఫోన్ ఈసీఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి సంబంధిత బాధితుడికి అప్పగించినట్లు ఇన్చార్జి ఏఎస్ఐ కె.రవీందర్ పేర్కొన్నారు. తిరిగి తన ఫోను తనకు అప్పగించినందుకు పోలీసుల పట్ల బాధితుడు హర్షం వ్యక్తం చేశారు. సిఈఐఆర్ ఆపరేటర్ గణేష్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక వేలం

నవతెలంగాణ-బిచ్కుంద

మంజీరా పరివాహక ప్రాంతం నుండి అనుమతులు లేకుండా తరలిస్తున్న పది ఇసుక ట్రాక్టర్లను అధికారులు పట్టుకొని కేసులు నమోదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆ ఇసుకను శుక్రవారం రెవెన్యూ అధికారులు వేలం వేశారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ రవీందర్ మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వేలంపాట నిర్వహించగా 36వేల 4 వందల రూపాయలకు పెద్ద కొడప్ గల్ గ్రామానికి చెందిన వ్యక్తి దక్కించుకున్నారు. వేలం పాటలో వచ్చిన డబ్బులను ప్రభుత్వ ఖజానాకు జమ చేయనున్నట్లు ఆర్ ఐ తెలిపారు.



ఇసుక వేలం నిర్వహిస్తున్న అధికారులు

ధాన్యం కొనుగోలుపై సమీక్ష

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ సొసైటీ పరిధిలో శుక్రవారం చైర్మన్ ఆకిడి గంగారెడ్డి డైరెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై డైరెక్టర్లతో చర్చించినట్టు తెలిపారు. హమాలి డబ్బులు, లావాదేవీలపై కూలంకషంగా మాట్లాడినట్టు తెలిపారు. జాన్కంపల్లి గేటు వద్ద ఏర్పాటు చేయనున్న గోదాములపై, రైతులకు వానాకాలంలో అందించే ఫర్టిలైజర్ పై తదితర అంశాలపై చర్చించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బాబురావు తోపాటు డైరెక్టర్లు . సి ఇ వో జైపాల్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పోడు భూముల సమస్య పరిష్కరిస్తా

- ఎమ్మెల్యే లక్ష్మికాంత్‌రావు
- జుక్కల్ మండలంలో సుడిగాలి పర్యటన
- పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం

నవతెలంగాణ-జుక్కల్

గ్రామాల్లో పోడు రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తోటలక్ష్మికాంత్‌రావు అన్నారు. జుక్కల్ మండలంలో ఎమ్మెల్యే శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేపట్టారు. మైబాపూర్ గ్రామంలో అంగన్వాడీ భవనం, గ్రామ పంచాయతీ భవనం , మురికి కాలువల నిర్మాణం కోసం 35 లక్షల నిధులు మంజూరు చేసి పనులకు శంకుస్థాపన చేశారు. అధేవిధంగా లొంగన్ గ్రామంలో నాలుగు లక్షలతో డ్రైనేజీ పనులను ప్రారంభించారు. సిద్దాపూర్ గ్రామములో పది లక్షలతో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు.

ఎమ్మెలేకు తులాబారం

పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే బస్వాపూర్ గ్రామంలో విజయోత్సవ సభలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు శంకర్‌రెడ్డి ఎమ్మెల్యేకు బంగారంతో తులాభారం వేయించి తన మొక్కును తీర్చుకున్నట్టు తెలిపారు. గ్రామ శివారులోని ప్రసిద్ధిగాంచిన బసవేశ్వర గుడి, చందమాపూరి మహరాజ్ మందిరాలను ఎమ్మెల్యే దర్శించుకున్నారు. గ్రామస్తుల కోరిక మేరకు బసవేశ్వర మందిరం వరకు సీసీ రోడ్డు వేయిస్తానని హామీ ఇచ్చారు.

గాలికుంటూ టీకాల కార్యక్రమం ప్రారంభం

జాతీయ పశువ్యాదుల నివారణ, గాలీకుంటు కుంటు వ్యాది నిరోదక టీకాల కార్యక్రమం ఎమ్మెల్యే ప్రారంభించినట్టు వెటర్నరీ డాక్టర్ పండరి తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెలే తోట లక్ష్మీకాంతారావ్ మాట్లాడుతూ వ్యాధుల నివారణకు టీకాలు తప్పనిసరి అని పశువైద్యుల సంరక్షణలో వైద్యం చేయించాలని అన్నారు. పశువులు నోరు లేని జీవాలని, వాటిన సక్రమంగా వైద్యం చేసి వాటిని రోగాల బారినపడకుండా చూడాలని సూచించారు. ఎండకాలం ఉన్నందున గ్రామాలలో పశువుల తొట్టిలలో నీరు తప్పక నింపి ఉంచాలని సూచించారు.

ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణాలకు భూమిపూజ

మండలంలోని కంతాలీలో, తాండాలో ఎస్సీ, ఎస్టీ భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అయితే అందరికి సమాన గౌరవం ఉంటుందని ఎమ్మెలే అన్నారు. అనంతరం కంతాలీ తాండా లోని సేవాలాల్ మందిరాన్ని దర్శించుకుని గిరిజన నాయకులతో మాట్లాడారు. కంతాలీ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇటివలే మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యకర్త కుటుంబాన్ని పార్టీ ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామపార్టీ నాయకుడు అరుణ్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



బెల్లంతో ఎమ్మెల్యేకు తులాభారం వేస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె షురూ

- పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని డిమాండ్



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న కార్మికులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపెట్

పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని కోరుతూ శుక్రవారం రోజు మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె ప్రారంభించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని తమ న్యాయమైన సమస్యలు డిమాండ్లను వెంటనే తీర్చాలని కోరుతూ సమ్మె ప్రారంభించినట్లు వెల్లడించారు. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో మధ్యాహ్నం భోజనం కార్మికుల సంఘం నాగిరెడ్డిపేట్ మండల అధ్యక్షుడు రియాజుద్దీన్, బాలమణి, వెంకటి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో పోషణ్ ఆహారం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ భారతి

నవతెలంగాణ-గాంధారి

గాంధారి మండల కేంద్రంలోని దుర్గానగర్ కాలనీలో అంగన్‌వాడి కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు, కిశోర బాలికాలకు, తల్లులకు పోషణ ఆహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ చిరుధాన్యాల సరైన పోషణ - సరైన ఆరోగ్యం అందిస్తుందని. కిశోర బాలికలకు కూడా పరిశుభ్రత రక్తహీనత వల్ల అనార్థాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి, అంగన్‌వాడీ టీచర్ సురేఖ, మహిళలు బాలికలు తదితరులు పాల్గొన్నారు.

పెరిక కార్పోరేషన్‌కు పదివేల కోట్లు కేటాయించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం పెరిక కులస్తుల సంక్షేమానికి పెరిక కార్పొరేషన్‌కు పదివేల కోట్ల నిధులను కేటాయించాలని పెరిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పిన్నం రామచంద్రం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కార్పొరేషన్ ను ఏర్పాటు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. నిరుపేదలైన పెరిక కులస్తులకు ప్రభుత్వం అన్ని రంగాల్లో ప్రాధాన్యతనిస్తూ ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. పెరిక కులస్తుల కులవృత్తి లేక వివిధ పనులు చేసుకుంటూ కాలం వెలదీస్తున్నారని, ఈ విషయమై ప్రభుత్వం పెద్ద మనసుతో నిధులు కేటాయించి ఆదుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ గ్రామంలో తాగునీటి ఎద్దడి నివారణకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం తెలిపారు. పలు కాలనీలో తాగునీటి సమస్య ఉండడంతో ఈ విషయంపై స్పందించిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ గురువారం రోజు రాత్రి రెండు బోర్లను వేయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కోఆప్షన్ సభ్యుడు షాహిద్ పాషా, కాంగ్రెస్ నాయకులు సుధాకర్, గులాం హుస్సేన్, శేఖర్, విక్రమ్, ఇమామ్. నరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని పోచారం గ్రామానికి చెందిన షేక్ షౌకత్ అలి (35) తాగుడుకు బానిసై ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ రాజు శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. పోచారం గ్రామానికి చెందిన షేక్ షౌకత అలీకి గత ఆరు సంవత్సరాల క్రితం శబీనాతో వివాహమైంది. కుటుంబ కలహాలతో భార్య శాబిన మూడేండ్లుగా తమ తల్లి గారి ఇంటి వద్ద ఉంటుంది. భార్య కాపురానికి రావడం లేదని తాగుడుకు బానిసైన షౌకత్ అలి భార్య పిల్లలు తన వద్దకు రావడంలేదని గురువారం రోజు రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి అన్న మసూద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ రాజు తెలిపారు.

షబ్బీర్‌అలీకి సన్మానం



షబ్బీర్ అలీని సన్మానిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రభుత్వ సలహాదారు మహమ్మద్ షబ్బీర్ ఆలీని జిల్లా పరిషత్ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి, కామారెడ్డి పట్టణ యాదవ సంఘం నూతన అధ్యక్షులు కృష్ణ యాదవ్ మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి, పుష్పగుచ్చాలు అందజేశారు.

చేపల వేటకు వెళ్లి ఒకరు మృతి



నవతెలంగాణ-గాంధారి

చేపల వేటకు వెళ్లి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన గాంధారి మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గాంధారి మండలం లోని రాంపూర్ గడ్డ కు చెందిన రత్లావత్ హరి (40) సంవత్సరాలు నిన్న రాత్రి సమయంలో ఇంట్లో గల దోమల తెరను తీసుకొని వెళ్లి చేపల కోసం పెద్దపోతంగాల్ గ్రామంలో ని యాతం చెరువుకు వెళ్లాడు. చెరువులో దిగగా పెద్ద పెద్ద గుంతలు ఉండటం వలన అతనికి ఈత కూడా రాకపోవడం వలన అందులో పడి మృతిచెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ ఆంజనేయులు తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష

- ప్రతిభ చూపిన పదోతరగతి విద్యార్థులకు బహుమతులు

నవతెలంగాణ-జుక్కల్

ఎలాంటి భయాందోళనకు గురవకుండా పదోతరగతి పరీక్షలు ప్రశాంతంగా రాయాలని ఉపాధ్యాయులు, ఎస్ఎఫ్ఐ నాయకులు సూచించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జుక్కల్ మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. అందులో ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కేజీబీవి విద్యార్థిని శ్రద్ధ , రెండవ బహుమతి పెద్ద ఎడ్గి జడ్పీహెచ్ఎస్ ప్రకాష్, మూడవ బహుమతి జుక్కల్ సంధ్య విజేతలుగా నిలిచారు.ముఖ్య అతిథిగా జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం హన్మంత్ రెడ్డి, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్ఎం హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులందరు విజేతలే , బాగా చదివి ఉత్తీర్ణత సాధించాలని, విద్యార్థుల పక్షాన ఎస్ఎఫ్ఐ ఎప్పడికి ఉంటుందని జిల్లా, మండల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు అజయ్ మాట్లాడుతూ పదోతరగతి విద్యార్థులు భయం లేకుండా ప్రశాంతంగా అలోచించి పరీక్షలు రాయాలని, దైర్యంగా ఉండాలని విజేతలు మీరేనని అన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవి ప్రత్యేక అధికారి అశ్విని, జుక్కల్ జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం హన్మంత్ రెడ్డి, పెద్ద ఎడ్గి జడ్పీహెచ్ఎస్ హెచ్ఎం తిరుపతయ్య, సీనీయర్ టీచర్ హీరా, ఎస్ఎఫ్ఐ మండల కమిటి అధ్యక్షుడు ఫిర్దోస్ తదితరులు పాల్గోన్నారు.



బహుమతులు అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చేపల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన సన్న చిన్న కారు రైతుల చేపల పెంపకం పై ఆసక్తి ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని ఇందిరా గాంధీ పథకం ఏపీఎం శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రైతులకు నీటి వసతి ఉండాలని, కనీసం అర ఎకరం భూమి ఉండాలని సూచించారు. చేపల పెంపకం చేయుటకు ఓపిక ఆసక్తి ఉండి 24 గంటలు యూనిట్‌ను చూసుకునే విధంగా ఉండి సంఘంలో సభ్యురాలై ఉండాలని సూచించారు. బ్యాంక్ ఖాతా మరియు పాన్ కార్డ్ ఆధార్ కార్డ్ కచ్చితంగా కలిగి ఉండాలని, యూనిట్ మొత్తం విలువ 3.30 లక్షలు ఇందులో 3.05 లక్షలు డ్రమ్‌కు, సీడ్‌కు, 8 నెలల కాలం లో వేసే దాణ రానున్నట్టు తెలిపారు. మిగిలిన 25.00 వేలు పాండ్ తవ్వుకోవడానికి వినియోగించాలని, ఇందులో షెడ్ రైతులే వేసుకోవాలని సూచించారు. పంట కాలం మొత్తం 8 నెలలు, ఇందులో 4 నెలలు డ్రమ్‌లో పెరుగుతాయని, మరొక 4 నెలలు పాండ్‌లో అంటే ప్రతి 4 నెలలకు ఒక పంట రానున్నట్టు తెలిపారు. ఉదయ్ ఆక్వా కంపెనీ మాగి నిజాంసాగర్ వారు మొత్తం టెక్నికల్ సపోర్ట్ ఉంటుందని, బై బ్యాక్ ఒప్పందంతో సదరు కంపెనీతో అగ్రిమెంట్ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు వినియోగించుకోవాలని సూచించారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి


నవతెలంగాణ-నసురుల్లాబాద్

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలని సీఎల్ఎఫ్ సంస్థ జిల్లా అధికారి డి శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నసురుల్లాబాద్ మండలంలోని దుర్కి గ్రామంలో మహిళ సంఘ సభ్యులతో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఎల్ఎఫ్ జిల్లా అధికారి డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్థిక అక్షరాస్యత కష్టపడి సంపాదించిన వాటికి విలువను, గుర్తింపును తీసుకవస్తుందన్నారు. భవిష్యత్ ప్రణాళికలో ఆర్థిక అక్షరాస్యత కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ఆర్థిక వ్యవహారాలు, రిజర్వ్ బ్యాంక్ గుర్తించిన ఆర్థిక సంస్థల్లో పొదుపు చేసుకోవాలని సూచించారు. ఈ ఆర్థిక సంస్థలలో ఆర్థిక మోసాలు జరిగితే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ ద్వారా పరిష్కారం పొందవచ్చు అన్నారు. అలాగే, గ్రామీణ ప్రాంతాలకు చెందిన మహిళలు పొదుపు ఎక్కడ చేసుకోవాలి, మన డబ్బుకు భద్రత పై అవగాహన కల్పించారు. అలాగే సైబర్ మోసాలు, ఆన్ లైన్ మోసాలపై జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ కౌన్సిలర్స్ బాలకృష్ణ, పర్వయ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా అధికారి డి. శ్రీనివాస్

పరీక్ష సామగ్రి అందజేత



విద్యారుల్థకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న చైర్మెన్ కేశిరెడ్డి

నవతెలంగాణ-పాల్వంచ

పాల్వంచ జడ్.పి.హెచ్.ఎస్ పాఠశాలలో శుక్రవారం గురు గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ చైర్మెన్ కేశిరెడ్డి గురువేందర్‌రెడ్డి పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రీ పంపిణీ చేశారు. విద్యార్థులు పట్టుదలతో చదివి పరీక్షలు బాగా రాయలని, పట్టుదలతో, కృషితో ఏదైనా సాధించవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, శీ ఆర్యభట్ట ప్రిన్సిపల్ హన్మంత్రావు, పీజేఆర్ ప్రిన్సిపల్ విజయకుమార్, మంజీర ప్రిన్సిపల్ సత్యనారాయణ , కౌటిల్య ప్రిన్సిపల్ నరేష్ గౌడ్, వైస్ ప్రిన్సిపల్ కృష్ణ ప్రసాద్ గౌడ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవులకు బీఆర్ఎస్ నాయకుల రాజీనామా



బీజేపిలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని బీఆర్ఎస్ మండల కమిటీ ముఖ్య సభ్యులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసినట్టు పార్టీ మండల నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ జడ్పీటీసి, ప్రస్తుత బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షుడు మాదారావ్ దేశాయి, వైస్ ప్రెసిడెంట్ మాజీ విండో చైర్మెన్ పడంపల్లి రాజు పటేల్ , జుక్కల్ టౌన్ ప్రసిడెంట్ గోట్కే రాజుపటేల్ తో పాటు వివిధ గ్రామాలకు చెందిన పదిమంది మాజీ సర్పంచ్‌లు ఇతర ముఖ్యనాయకులు జిల్లా పార్టీ అధ్యక్షునికి తమ పదవులకు, సభ్యత్వం రద్దు చేయాలని కోరుతూ రాజీనామ పత్రాలను పంపించారు. తదనాంతరం హైదారాబాద్‌లో ఎంపీ బీబీపాటిల్ నివాసంలో బీజేపిలో చేరారు.

బేగంపేట్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలకు లక్కీడ్రా



లక్కీ డ్రా తీస్తున్న చిన్నారి

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సమక్షంలో హైదరాబాద్ బేగంపేట పబ్లిక్ స్కూల్ 1వ తరగతి ప్రవేశాలకు లక్కీ డ్రా నిర్వహించారు. ఇద్దరు బాలికలు లక్కీ డ్రా తీశారు. డ్రాలో సుంకరి బృందన, త్రిక్షణ ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారిని జి. రజిత, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ , అధికారులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్పోరేషన్ ఏర్పాటు పట్ల హర్షం

నవతెలంగాణ-దోమకొండ

పలు కులాలకు ప్రత్యేక కార్పోరేషన్‌లు ప్రకటించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ముదిరాజులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అభినందనీయం అని రాష్ట్ర ముదిరాజ్ మహా సభ రాష్ట్ర కార్యదర్శి అబ్రబోయిన స్వామి అన్నారు. దోమకొండ మండల కేంద్రం లోని ముదిరాజ్ సంఘము ఆధ్వర్యంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. రాష్ట్రంలో దశాబ్దాల పోరాటం తర్వాత ముదిరాజ్‌లకు ప్రత్యేక కార్పొరేషన్ ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షణీయమని అన్నారు. అలాగే బీసీ డీ గ్రూప్ నుంచి ఏ కు రిజర్వేషన్ మార్చి ముదిరాజులను ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు పున్న లక్ష్మన్, మండల అధ్యక్షుడు పుట్ట రమేష్, గరిగే సురేష్, రాజేందర్ అసబోయిన శ్రీనివాస్, నాగారపు రాములు, కొండ అంజయ్య, సీతారాం ప్రసాద్, బంధం రాజేశ్వర్, బాలయ్య, నాగభూషణం, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట్ మండలంలోని గోపాల్‌పేట్ శివారులో గల పోచారం ప్రధాన కాలువ పక్కన పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజు శుక్రవారం తెలిపారు. వారి వద్ద నుండి 5290 రూపాయలు 4 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

బీటీ రోడ్డు మంజూరు పట్ల హర్షం

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణం నుండి రాజంపేట పట్టణం వరకు నుండి 25 కోట్ల రూపాయలతో బీటీ రోడ్డు మంజూరు చేయడం పట్ల మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి పి సి సి రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు మద్ది చంద్రకాంత్ రెడ్డి, ఎంపీపీ గాల్ రెడ్డి మాట్లాడుతూ భిక్కనూర్ పట్టణం నుండి రామేశ్వర్ పల్లి, తిప్పాపూర్, మోటాటి పల్లి, ఆరేపల్లి తండా, అరేపల్లి, తలమడ్ల నుండి రాజంపేట వరకు డబుల్ లైన్ బీటీ రోడ్డు మంజూరు చేసినందుకు, అలాగే భాగిర్తిపల్లి ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా సీసీ రోడ్డుకు పది లక్షల రూపాయలు మంజూరు చేసినందుకు ప్రభుత్వ ముఖ్య సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలీ కి ధన్యవాదాలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో ఎన్నోసార్లు తెలియజేసిన పట్టించుకోలేదని డబుల్ లైన్ మంజూరు చేసినందుకు గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుదర్శన్, మండల కాంగ్రెస్ నాయకులు, గ్రామ అధ్యక్షులు నర్సింలు, స్వామి, అశోక్ పాల్గొన్నారు.

ఘనంగా మాన్యశ్రీ కాన్షిరాం జయంతి



నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

నవతెలంగాణ-బోధన్
బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యశ్రీ కాన్షిరాం జయంతి వేడుకలను శుక్రవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ఆచన్‌పల్లిలో గల పార్టీ కార్యాలయంలో బీఎస్పీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బహుజన రాజ్యాధికారం కోసం ఆయన చేసిన త్యాగం, ఆయన ఉద్యమాలను నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో బిఎస్పి నాయకులు రామకృష్ణ, సుభాష్, గంగాధర్, శంకర్ ఉన్నారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఏర్గట్ల
మండల కేంద్రంలో ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా బాల్కొండ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్‌రెడ్డి మంజూరు చేయించిన 20 లక్షల రూపాయల సీసీ రోడ్ల నిర్మాణానికి కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమదేవరెడ్డి కొబ్బరికాయ కొట్టి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సునీల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సోమ దేవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు శివన్నోళ్ళ శివకుమార్, కాంగ్రెస్ నాయకులు రొక్కాడ సంజీవ్, బెజ్జారం భాను, రెంఢ్ల రమేష్, పెద్దిరెడ్డి రవి, ముస్కు మోహన్, బద్దం లింగారెడ్డి, బద్దం జితేందర్ రెడ్డి, గ్రామకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాఠశాల భవనాన్ని ప్రారంభించిన ఎంపీపీ



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లావణ్య లింగాగౌడ్

నవతెలంగాణ-బాల్కొండ
మండల పరిధిలోని కిసాన్‌నగర్ (దుబ్బ)లో ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని ఎంపీపీ లావణ్య లింగాగౌడ్ శుక్రవారం ప్రారంభించారు. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యుడు వేముల ప్రశాంత్‌రెడ్డి మంజూరు చేసిన పది లక్షల రూపాయలతో ఆధునిక హంగులతో నూతన భవనాన్ని నిర్మించారు. ఎంపీడీవో విజయ్ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ రాజేశ్వర్, ఎంపీటీసీ సభ్యుడు రామ్ రాజ్‌గౌడ్, మాజీ ఎంపీపీ నాగభూషణం, పిఆర్‌టియు మండలాధ్యక్షుడు శ్రీనివాస్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజేంద్రకుమార్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని సరోజ, మాజీ ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, వీడీసి అధ్యక్షుడు కపిల్ కుమార్, బీఆర్ఎస్ నాయకులు శరత్, ప్రసాద్, వాహెద్, కె.అశోక్, స్వామి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి పన్నులే కీలకం

- ప్రజలు సహకరించాలి



పన్నులు వసూలు చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
గ్రామంలో పేరుకుపోయిన ఇంటి పన్నుల వసూళ్లకు ఇంటింటికి తిరుగుతున్నప్పుడు గ్రామస్తులు సిబ్బందికి తమవంతు సహకారం అందజేయాలని గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీధర్ అన్నారు. శుక్రవారం ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో పేరుకుపోయిన బకాయిలను వసూలు చేయడానికి పంచాయతీ సిబ్బందితో కలిసి ఇంటింటికీ తిరుగుతూ వసూలు చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా కార్యదర్శి శ్రీధర్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలో డబ్బులుంటేనే గ్రామంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఇదే కాకుండా వేసవిలో తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ దీపాలు, తదితరులు పనులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా చర్యలు తీసుకోవచ్చని పేర్కొన్నారు. గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పన్ను వసూళ్లు చేయడం జరుగుతుందని, గ్రామప్రజలు సహకరించి ఇంటి పన్నులు, వ్యాపార సముదాయాలు ప్రతియేటా లైసెన్స్‌లను పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కారోబార్ పిల్లి నరేందర్, భాస్కర్, గంగారాం పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీ మాధవి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్



ఫుడ్‌ఫెస్టివల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-ఎడపల్లి
మండల కేంద్రంలోని శ్రీ మాధవి పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్ కార్యక్రమాన్ని పాఠశాల కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయులు మల్లెపూల సురేష్‌గౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదువుతున్న బాల బాలికలు తమ ఇంటి వద్ద పిండి వంటలతో పాటు వివిధ రకాల కూరగాయలతో కూడిన రుచికరమైన వంటలను తయారు చేసుకుని పాఠశాలకు తీసుకువచ్చారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మల్లెపూల సురేష్ గౌడ్ మాట్లాడారు. నేటి రోజుల్లో యువత జంక్ ఫుడ్‌కు అలవాటు పడి తమ ఇండ్లలో చేసిన వంటలను సరిగా భోజనం చేయకపోవడం సరికాదన్నారు. గృహ భోజనాన్ని మాత్రమే చిన్నారులు, యువకులు, మహిళలు అలవాటు చేసుకోవాలన్నారు. గృహ భోజనంలో తల్లులు చేసిన వంటలు చాలా రుచికరమైనవని ఆయన గుర్తు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల బాలబాలికలు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై మురికి నీరు చేరకుండా ఇంకుడుగుంత ఏర్పాటు

నవతెలంగాణ-రెంజల్
మండలంలోని సాటాపూర్ గ్రామంలోని సబ్‌సెంటర్ సమీపంలో మురికి నీరు రోడ్డుపై వస్తుండడంతో ప్రజలకు ఇబ్బందిగా ఏర్పడిందని గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ పేర్కొన్నారు. ఈ మురికి నీటిని రోడ్డుపైకి రాకుండా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ ద్వారా రూ.12 వేల వ్యయంతో ఇంకుడు గుంతను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట కారోబార్ మంగురామ్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తడపాకల్ పాఠశాలలో మాక్ పోలింగ్

నవతెలంగాణ-ఏర్గట్ల
తడపాకల్ పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు గంగాధర్ అధ్యక్షతన విద్యార్థులకు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఇందులో ఎండీ రజాక్ అనే విద్యార్థిని తమ నాయకుడిగా విద్యార్థులు ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుధాకర్, గంగాధర్, రాములు, నాగప్ప, రవి, స్వప్న, విజయ, సుజాత, కృష్ణప్రసాద్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బ్యాంకులను సద్వినియోగం చేసుకోవాలి

- రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలి
- యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ హెడ్ శంకర్ హాయ్‌రాం



రుణ మేళాలో పాల్గొన్న స్వయంసహాయక సభ్యులు, అధికారులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
స్వయం సహాయక సంఘాలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని యూనియన్ బ్యాంక్ డిప్యూటీ జనరల్ మేనేజర్, రీజినల్ హెడ్‌శంకర్ హాయ్‌రాం తెలిపారు. శుక్రవారం ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో యూనియన్ బ్యాంక్ ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, అంకాపూర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా డ్వాక్రా స్వయం సహాయక సంఘాల ఉత్సవ్ రుణా మేళాకు అయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. యూనియన్ బ్యాంక్ ద్వారా రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళా సంఘాలకు ఒక్కో గ్రూపునకు 20 లక్షల రూపాయల చొప్పున యూనియన్ బ్యాంక్ తరవున ఎలాంటి డాక్యుమెంట్ లేకుండా రుణం పొందే వీలుంటుందని, క్రమం తప్పకుండా బ్యాంకులో ప్రతినెల చెల్లించవలసిన రుణాలను చెల్లిస్తూ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయాలన్నారు. నిజామాబాద్ రీజియన్ పరిధిలో 11,095 సంఘాలు ఉన్నాయని, ఇప్పటివరకు 631కోట్లు రీజియన్‌లో రుణాలు అందజేశామని తెలిపారు. ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, అంకాపూర్ బ్యాంకు పరిధిలో 690సంఘాలకు 53కోట్ల రూపాయల రుణాలను అందజేశామని, ఒక్కరోజే 3 కోట్లు ఒకొక్క సంఘానికి 20 లక్షల చొప్పున అందజేయడం హర్షణీయమన్నారు. పేదరిక నిర్మూలనకు 1984లో బంగ్లాదేశ్‌లో స్వయం సహాయక సంఘాలు ఏర్పడ్డాయని, అది భారత దేశంలో నాబార్డ్ ఆధ్వర్యంలో నేడు కోట్ల రూపాయల టర్నోవర్‌తో ముందుందని వివరించారు. పుట్టిన చిన్నారి నుంచి మొదలుకొని పండు ముసలి వరకు బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉండాలని సూచించారు. ఇదే కాకుండా బ్యాంకులలో తక్కువ డబ్బులతో బీమా చేసుకునే సదుపాయం ఉందని దాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏజీఎం శివ కోటయ్య మాట్లాడుతూ.. గత ంలో ఎస్‌హెచ్‌జి సంఘాలకు రుణాలు ఇవ్వడానికి ఇబ్బందులు ఉండేవని, కానీ నేడు కాలానికి అనుగుణంగా స్వయం సహాయక సంఘాలు వృద్ధి చెందుతూ ఒక్కొక్క సంఘానికి 20 లక్షలు ఎలాంటి పూచీకత్తు లేకుండా అందజేస్తున్నామన్నారు. కొన్ని గ్రూపులు డిఫాల్ట్‌గా ఉన్నాయని, సంఘాలు ప్రతిసారి సమావేశం నిర్వహించుకోని పలు విషయాలపై చర్చించుకుని వృద్ధి సాధించడానికి మంచి అవకాశం ఉందన్నారు. ప్రైవేట్ బ్యాంకులు స్వయం సహాయక సంఘాలకు రుణాలు ఇవ్వడానికి ముందుకు వస్తున్నాయని, భవిష్యత్తులో ఇంకా సంఘాలకు ఎక్కువ సంఖ్యలో పెరగనున్నాయని, తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని వ్యాపారంలో వృద్ధి సాధించాలని పేర్కొన్నారు. పదిమంది సంఘటితంగా ఉండాలని, మహిళ సంఘంలో ప్రతి గ్రూపునకు సీనియారిటీ ప్రకారంగా యూనియన్ బ్యాంకు నుంచి రుణాలు ఇవ్వనున్నట్టు తెలిపారు. రోజు రోజుకు మార్పు వస్తుందని, తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా చెల్లించుకోవాలని కోరారు. అనంతరం సంఘాలకు రూ.20లక్షల రుణాల జంబో చెక్కులను అందజేశారు. డ్వాక్రా సంఘాలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంఘాలకు ఐదు కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎం రవీందర్‌రెడ్డి జక్రాన్‌పల్లి, సువర్ణ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఇందల్‌వాయి, జక్రాన్‌పల్లి, మునిపల్లి, అంకాపూర్ బ్రాంచ్ మేనేజర్లు శ్రీనివాస్, అశోక్‌రాం, సుధీర్, విజయ్, ఆర్డీఓ విశాల్ పావర్, సిసి అనురాధ, మోతీరాం, ఉదయ్, లక్ష్మీ, వంశీ, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు ఇంటినెంబర్లు ఇవ్వాలి

- వినతిపత్రం అందజేత



వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-ఆర్మూర్
పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటినెంబర్లు ఇవ్వాలని ఇంచార్జ్ మున్సిపల్ చైర్మన్ షేక్ మున్నాను శుక్రవారం సీపీఐ(ఎం) నాయకులు కోరారు. ఈ సందర్భంగా సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నిరుపేదలందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కట్టిస్తామని చెప్పి ఏ ఒక్క నిరుపేదకు ఇవ్వకపోవడంతో ప్రజలు విసిగి వేసారి డబుల్ బెడ్ రూమ్ రాదు అని నిరాశతో ప్రభుత్వ స్థలంలో 2017 సంవత్సరంలో సిపిఎం ఆధ్వర్యంలో యానం గుట్ట సుందరయ్య కాలనీలో గుడిసెలు వేసుకొని ఇల్లు కట్టుకొని అక్కడే స్థిర నివాసం ఉంటున్నారని తెలిపారు. దాదాపు 300 కుటుంబాలు ఇల్లు కట్టుకొని స్థిర నివాసం ఏర్పాటు చేసుకుని ప్రస్తుతం 100 కుటుంబాలు అక్కడే నివాసం ఉంటున్నారని వివరించారు. గత ప్రభుత్వ పాలకులకు సమస్య వివరించినా.. పెడచెవిన పెట్టారని తెలిపారు. 2024 సంవత్సరంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పేదలందరికీ ఇంటి స్థలం ఇచ్చి ఐదు లక్షలు, ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని చెప్పినట్టు వివరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్థలంలో వేసుకున్న గుడిసెలకు ఇండ్లకు ఇంటినెంబర్లు ఇవ్వాలని, మౌలిక వసతులు కల్పించాలని అన్నారు. రాత్రిపూట పాములు, తేళ్లు వస్తున్నాయని, కరెంటు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు షాహిదా బేగం, కుల్దీప్ శర్మ, చిన్నయ్య, సిద్ధల నాగరాజు, జవహర్‌సింగ్, కుంతబాయి, అంబులెన్స్ రాజు, సాయిలు, మల్లేష్, యానంగుట్ట సుందరయ్య కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సంతోష్, ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కోనాస ముందర్ సింగిల్‌విండో కార్యాలయం వద్ద రాజ్యసభ సభ్యులు ఎంపీ సంతోష్ కుమార్, మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్రపటాలకు శుక్రవారం పాలాభిషేకం చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన గోదాము నిర్మాణం కొరకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి కృషితో ఎంపీ సంతోష్ కుమార్ తన రాజ్యసభ నిధుల నుంచి రూ.10లక్షలు మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ విండో చైర్మన్ సామా బాపురెడ్డి ఆధ్వర్యంలో పాలకవర్గ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విండో చైర్మన్ సామా బాపురెడ్డి మాట్లాడుతూ.. అడిగిన వెంటనే స్పందించి రైతుల శ్రేయస్సు కోసం, విండో అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డికి విండో చైర్మన్ సామ బాపురెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు కాలేరు శేఖర్, మాజీ ఉప సర్పంచ్ పేరం లింబాద్రి, విండో కార్యదర్శి రాజేశ్వర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీఎల్‌ఎఫ్ జహీరాబాద్ అభ్యర్థిగా వడ్లసాయికృష్ణ

నవతెలంగాణ-కామారెడ్డి
బీఎల్‌ఎఫ్ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ టికెట్‌ను వడ్లసాయికృష్ణ కేటాయించారు. హైదరాబాద్‌లో బీఎల్‌ఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఐదుగురు అభ్యర్థులను శుక్రవారం ఖరారు చేసింది. ఈ సమావేశానికి అధ్యక్షులుగా యస్. సిద్ధిరాములు, రాష్ట్ర నాయకులు, యం మట్టయ్య వ్యవహరించారు. చైర్మన్ నల్ల సూర్య ప్రకాశ్, ఎంసిపిఐ (యు) అఖిల భారత ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ మద్దికాయాల అశోక్ ఓంకార్ హాజరు అయ్యారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌ఎఫ్ కన్వీనర్లు దండి వెంకట్, పర్వతాలు, గడగొని రవి, వనం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మైనార్టీ జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ నిహాల్

నవతెలంగాణ-కామారెడ్డి
బీజేపీ మైనార్టీ జిల్లా అధ్యక్షులుగా మహమ్మద్ నిహాల్ శుక్రవారం నియామకం అయ్యారు. బీజేపీలో కొనసాగుతూ కామారెడ్డి టౌన్ మైనార్టీ ప్రెసిడెంట్ గా ఎదిగిన తర్వాత కాటిపల్లి వెంకటరమణారెడ్డి వెన్నంటే ఉండి ముస్లింలకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మైనార్టీ ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు జిల్లా అధ్యక్షులు అరుణతారకు, ఎమ్మెల్యే కేవీఆర్‌కు, ప్రతి ఒక్క కార్యకర్తకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బీజేవైఎం మండలాధ్యక్షునిగా కంది మనోజ్

నవతెలంగాణ-దోమకొండ
దోమకొండ మండల బీజేవైఎం అధ్యక్షులుగా కంది మనోజ్, బీజేపీ మండల అధ్యక్షులుగా భూపాల్ రెడ్డిని నియమించినట్టు నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు బీజేపీ బలోపేతం కోసం కృషి చేస్తామని, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య

నవతెలంగాణ-సదాశివనగర్
మండలంలోని అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామానికి చెందిన చేకెళ్లి రజనీకాంత్ (28) అప్పుల బాధతో ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు శుక్రవారం తెలిపారు. మృతుడు డ్రైవింగ్ చేస్తున్న ట్లు తెలిపారు. బార్య సౌమ్య పిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టినట్టు తెలిపారు. మృతదేహానికి పంచనామ నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియాస్పత్రికి తరలించినట్లు తెలిపారు

నాలుగు నెలల బకాయి వేతనాలు చెల్లించాలి

- సిఐటియు ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-వర్ని
ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసే కాంట్రాక్టు వర్కర్ల నాలుగు నెలల బకాయి వేతనాలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని 'తెలంగాణ హాస్పిటల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్' (సీఐటీయూ) ఆధ్వర్యంలో వర్ని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్‌కు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.

మోకాళ్లపై నిలబడి మధ్యాహ్న భోజన కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న కార్మికులు

నవతెలంగాణ-బోధన్
మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం చెల్లించవలసిన బకాయి వేతనాలను, బిల్లులను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ గత మూడు రోజులుగా మధ్యాహ్న భోజన కార్మికులు బోధన్ ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్నారు. అందులో భాగంగా శుక్రవారం మోకాళ్లపై నిలబడి వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం మండలాధ్యక్షురాలు ఉమా, సాలూరా మండలాధ్యక్షురాలు రూప మాట్లాడుతూ.. పెంచిన వేతనాలను ఏప్రిల్ 2022 నుంచి అమలు చేయాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రతి విద్యార్థికి 25 రూపాయలు చొప్పున స్లాబ్ రేటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే గ్యాస్, గుడ్లను ప్రభుత్వం సరఫరా చేయాలని, కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని స్వచ్ఛంద సంస్థలకు అందించే ప్రయత్నం మానుకోవాలని అన్నారు. కార్మికులను అక్రమంగా తొలగించవద్దని, అలాగే ప్రతి నెల 5వ తేదీన బిల్లులు, వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ నిరసనలో రూప, పుష్ప, ఉమా, సుభద్ర, ఈశ్వరి, లక్ష్మి, నాగరాజు, విజయ్, పోశవ్వ తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్



నీలా జీపీని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

నవతెలంగాణ-రెంజల్
వేసవి కాలంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందు జాగ్రత్తగా తాగునీటిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని నీలా గ్రామపంచాయతీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవికాలంలో ప్రజలు ఇబ్బందులు పడకుండా పైప్‌లైన్లు, లీకేజీలపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో పోలింగ్ బూత్‌లను ఆయన పరిశీలించారు. పోలింగ్ బూత్‌ల ఏర్పాటు గురించి బిఎల్‌ఓలను అడిగి తెలుసుకున్నారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ స్వచ్ఛమైన నీటిని ప్రజలకు అందించాలని ఆయన అన్నారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, మిషన్ భగీరథ డిఈ మునినాయక్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, పంచాయతీ కార్యాలయం అధికారి రాజాబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్, గ్రామ కార్యదర్శి డి.రాణి, కారోబార్ రమేష్, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ భగత్ సింగ్ వర్ధంతి సభలను విజయవంతం చేయండి


- పి.డి.ఎస్.యూ,పి. వై.ఎల్



పోస్టర్లను ఆవిష్కస్తున్న పిడిఎస్యూ, పివైఎల్ నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
కామ్రేడ్ భగత్ సింగ్ 93 వ వర్ధంతి సభలను ఈ నెల 15 నుండి 30 వరకు జరపాలని పి.డి.ఎస్.యూ ,పి. వై.ఎల్ నాయకులు జన్నారపు రాజేశ్వర్, వనమాల సత్యంలు పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని నీలం రామచంద్రయ్య భవన్ ముందర భగత్‌సింగ్ వర్ధంతి సభల పోస్టర్స్‌ను పిడిఎస్యూ, పివైఎల్ అధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నేడు దేశంలో ఫాసిజం పెరిగిపోయిందని, విద్యను మొత్తం కాషాయీకరించాలనే నేపథ్యంలో నూతన విద్యా విధానం 2020 తీసుకువచ్చారని అన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, మోడీ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఉద్యోగాలు భర్తీ చేయటం లేదని, ప్రశ్నించే గొంతులపై ఉప చట్టాలను ప్రయోగిస్తున్నారని, ఎన్నికల నేపథ్యంలో నేడు సిఏఏ తీసుకువచ్చారని అన్నారు. కావున మోడీ మతోన్మాద వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా భగత్ సింగ్ ఉద్య మస్ఫూర్తితో పోరాటం చేయాలని, ఈనెల 15 నుంచి 30 వరకు భగత్ సింగ్ వర్ధంతి సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సాయినాథ్, భాస్కర్, ప్రిన్స్, దేవిక, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

రజాకర్ సినిమాలో ఆర్మూర్ వాసి



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణానికి చెందిన సమాజ సేవకుడు శ్రీమాన్ కొట్టూరి అశోక్ శుక్రవారం విడుదలైన రజాకర్ సినిమాలో నటించారు. నిన్న ప్రపంచ వ్యాప్తంగా విడుదలైన రజాకార్ సినిమాలో రజాకార్లను తరిమికొట్టే పాత్రలో అశోక్ నటించారు. భవిష్యత్తులో సినిమా రంగంలో మరెన్నో విజయాలు సాధించాలని పట్టణానికి చెందిన గటాడి దినేష్ శ్రీమాన్ కొట్టూరి అశోక్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంపీ, ఎమ్మెల్యే 'టీ టైమ్'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలో ఇరానీ కేఫ్‌ను నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధనపాల్ సూర్యనారాయణ శుక్రవారం ప్రారంభించారు. నగరంలో మరో నూతన కేఫ్ జ్యూస్ సెంటర్‌ను ప్రారంభించడం సంతోషకరంగా ఉందని వారు తెలిపారు. అయితే అదే కేఫ్‌లో ఎంపీ, ఎమ్మెల్యే కలిసి టీ తాగారు.



టీ తాగుతున్న ఎంపీ, ఎమ్మెల్యే

దశ మారనున్న రైతు వేదికలు

- రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించేలా చర్యలు
- దశలవారీగా 2601 రైతు వేదికలలో అమలు చేయడానికి చర్యలు చేపట్టనున్న ప్రభుత్వం

నవతెలంగాణ-బోధన్

రైతులకు శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కార్యకరణ రూపొందించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పది సంవత్సరాలుగా రైతు వేదికలను మనుగడ లేకుండా చేసింది. రైతు వేదికలను లక్షల ఖర్చు చేసి నిర్మించిన ప్రయోజనం లేకుండా పోయాయి. అలాగే పార్టీ కార్యక్రమాలకు నాయకులు ఉపయోగించుకున్న ఘటనలున్నాయి. ఏనాడు కూడా రైతులకు శిక్షణ, సమావేశాలు జరిగిన దాఖలాలు లేవు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రైతుల కోసం రైతు నేస్తం అనే కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యక్రమాల ద్వారా రైతు వేదికలను రైతులకు సాగులో విప్లవాత్మక మార్పులు తీసుకోవడానికి డిజిటల్ విధానంలో అవగాహన, శిక్షణ అందించాలని భావిస్తుంది. రాష్ట్రంలోని ప్రతి రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతు నేస్తం కార్యక్రమాన్ని సీఎం రేవంత్‌రెడ్డి మార్చి 6వ తేదీన ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 2601 రైతు వేదికలలో రియల్ టైమ్స్ సొల్యూషన్ త్రు డిజిటల్ ప్లాట్ ఫామ్ ప్రాజెక్టు ద్వారా ప్రయోగాత్మకంగా మొదటి విడత 110 రైతు వేదికలలో ఈ వ్యవస్థ ఏర్పాటు చేశారు. తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ కంపెనీ దీనికి పరికరాలు సమకూర్చింది. టీ ఫైబర్, బిఎస్ఎన్ఎల్‌ల ద్వారా అనుసంధానించి కేబుల్ నెట్వర్క్‌ను సమకూర్చాయి. ఉగాది పండగ నాటికి అన్ని రైతు వేదికలలో ఈ వ్యవస్థను అనుసంధానం చేయడానికి ప్రభుత్వం కార్యక్రమం రూపొందించింది.



సాలూరా రైతు వేదిక

రైతులకు అందించే సేవలు..

రైతు నేస్తం ద్వారా వ్యవసాయంలో విస్తరణ కార్యకలాపాలను బలోపేతం చేయడం, నూతన సాంకేతికతపై అవగాహన కల్పించి సాగును లాభసాటిగా చేయడం, రైతు సమస్యలను పరిష్కరించడానికి కొత్త వ్యూహాలను రూపొందించడం, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, రైతులకు మధ్య అంతరాన్ని తొలగించి సాగు సాంకేతికత బదిలీకి ప్రభుత్వం రైతులకు సేవలు అందించనుంది.

వారంలో రెండు రోజులు ఆన్‌లైన్ శిక్షణ..

రైతు వేదికల్లో రైతులకు వారంలో రెండు రోజులపాటు ఆన్లైన్ విధానంలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రతి వారం మంగళ, శుక్రవారంలో శాస్త్రవేత్తలు, అధికారులు రైతుల మధ్య ప్రత్యక్ష పరస్పర విషయ మార్పిడికి జూమ్, యూట్యూబ్ లైవ్ కార్యక్రమం ద్వారా రైతువేదికలను అనుసంధానించి శిక్షణను అందిస్తారు. శాస్త్రవేత్తలు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులతో క్షేత్రస్థాయి సమస్యలపై ముఖాముఖిగా చర్చిస్తారు. డిజిటల్ సేవలలో భాగంగా శాస్త్రవేత్తలు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారు. రైతువేదికలో ప్రతి మంగళవారం శుక్రవారం రైతులకు నేరుగా ఆన్లైన్ శిక్షణ చేపడతారు. వ్యవసాయంతో పాటు ఇతర శాఖల అధికారులు రైతులకు అవగాహన కల్పించేందుకు అనుకూలంగా రైతు వేదికలను రూపొందించే ప్రయత్నంలో ప్రభుత్వం కార్యచరణ చేపడుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రైతు వేదికల ద్వారా ఉత్తమ సాంకేతిక వ్యవసాయ విధానం తేవడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం



సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న పలువురు

నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కురుమ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ కురుమ సంఘం మండలాధ్యక్షులు మేడి రవి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కురుమల సంక్షేమం కోసం, కురుమల అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని, దానికి తమ సంఘం తరపున సీఎం రేవంత్‌రెడ్డికి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేపట్టారు. రాష్ట్ర జనాభాలో యాదవుల కంటే ఎక్కువ జనాభా ఉన్న కురుమలను యాదవులతో కలపకుండా వేరుగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో బోధన్‌టౌన్ అధ్యక్షులు వీరయ్య, గొర్రెల, మేకల పెంపకందార్ల సహకార సంఘం మండలాధ్యక్షులు సిరిగిరి దేవరావు, శంకర్, రాజు, సురేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

దేవునిగుట్ట తండాలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-కోటగిరి

మండలంలోని దేవునిగుడి తండా గ్రామపంచాయతీలో ఐదు లక్షల రూపాయలతో సీసీ రోడ్డు పనులను మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు ఎలమంచిలి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. సిసి రోడ్డు పనులు ప్రారంభించడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కృష్ణారెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ వినియోగదారుల దినోత్సవం



అవగాహన ర్యాలీలో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-ఆర్మూర్

ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా మండల వినియోగదారుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుంచి అంగడి బజార్, టేకి మస్జిద్, ఎమ్మార్వో ఆఫీస్, అంబేద్కర్ చౌరస్తా వరకు వినియోగదారుల హక్కులు, చట్ట పరిధిలో వచ్చే సేవలు, ఫిర్యాదు ఎలా చేయాలి అనే అంశాలను జాగరుకత చేస్తూ ఘనంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వినియోగదారుల సంఘం ప్రధాన కార్యదర్శి బొచ్కర్ దత్తాద్రి మాట్లాడుతూ నగదు చెల్లించి వస్తువులు, సేవలను ఉపయోగించుకునే ప్రతి ఒక్కరూ వినియోగదారులేనని తెలిపారు. వస్తువు సేవలు వినియోగించినప్పుడు ధరల విషయంలో గానీ, కొలతల విషయంలో, పరిమాణంలో, ప్రమాణం వస్తువులు లేదా సేవల సమస్య తలెత్తినప్పుడు వ్యాపారి లేదా సంబంధిత అధికారికి న్యాయం కోసం రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి రసీదు తీసుకోవాలని వివరించారు. లేదా ఆయా కార్యాలయాల్లో ఉండే ఫిర్యాదుల పెట్టెలు, విజిలెన్స్ లేదా కంప్లైంట్ సేల్‌లను వినియోగించుకోవచ్చని సూచించారు. వినియోగదారుల ఫోరంను ఆశ్రయించే ముందు వినియోగదారుల సంఘం ద్వారా కూడా న్యాయం కోసం ప్రయత్నించవచ్చని, కేసును 90 రోజుల్లోగా పరిష్కరించడానికి వీలుందని, ఫిర్యాదు నేరుగానైనా లేదా పోస్ట్ ద్వారా అయినా చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీ నరసయ్య,, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

18న వాహనాల వేలంపాట

నవతెలంగాణ-ఆర్మూర్

ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఆదేశానుసారం ఈనెల 18న వివిధ కేసులలో పట్టుబడిన ఆరు ద్విచక్ర వాహనాలను వేలం వేస్తున్నట్టు ఎక్సైజ్ సీఐ స్టీవెన్సన్ శుక్రవారం తెలిపారు. వేలంలో పాల్గొనేవారు 25శాతం డిపాజిట్‌ను పొందుపరిచి బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

జీవితంపై విరక్తిచెంది యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ మండలం చిన్నమావంది గ్రామానికి చెందిన మేకల మల్లేష్(22) అనే యువకుడు జీవితంపై విరక్తిచెంది చిన్నమావంది, పెగడాపల్లి గ్రామాల మధ్య గల వాగులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. మృతునికి గత 10 నెలల క్రితం పెళ్లి అయ్యింది. అతని తీరు నచ్చక మృతుని భార్య గత కొన్ని నెలల క్రితం తన పుట్టింటికి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

ఆటోడ్రైవర్ కుటుంబానికి
రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

- మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా
- ఆటో డ్రైవర్ స్వామి కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఆటోడ్రైవర్ కుటుంబానికి ప్రభుత్వం రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా డిమాండ్ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా కెనాల్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్ స్వామి, భార్య దేవా లక్ష్మి ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. అయితే శుక్రవారం వారి కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించిందని, దానికి తాము వ్యతిరేకం కాదని, మహిళలకు ఫ్రీ బస్ సౌకర్యం కల్పించే ముందు ఎవరికి నష్టం జరుగుతుందనే ఆలోచన చెయ్యాలన్నారు. అలాంటి ఆలోచన చేయకపోవడం వల్లే ఆటో డ్రైవర్ దంపతులు పోషణ భారమై ఆత్మహత్య చేసుకున్నారని, దాంతో ఆటో డ్రైవర్ కుమారుడు అనాథగా మిగిలాడని తెలిపారు.



అనాథగా మిగిలిన బాలుడిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

రాష్ట్రంలో రోజుకు ఒకచోట ఆటోడ్రైవర్ ఆత్మహత్యలు జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఆటో డ్రైవర్ స్వామి కుటుంబానికి రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని, రాష్ట్రంలో ఉన్న ఆటో డ్రైవర్లకు రూ.10 నుంచి 15వేల నగదు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

ఉచిత బస్ స్కీం తీసుకువచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్ల గురించి ఎందుకు ఆలోచన చేయడం లేదని ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృతం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచన చేయాలన్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నగర అధ్యక్షులు సిర్పరాజు, కార్యదర్శి ఎనగందుల మురళి, సుదాం రవిచందర్, సుజిత్‌సింగ్, సత్యప్రకాశ్, దారం సాయిలు, నవీన్, విక్రమ్‌గౌడ్, సాయి, రామడుగు బాలకిషన్, రంగు సీతారాం, సదానంద్, నాయకులు రవి చందర్ తదితరులు పాల్గొన్నారు.

చందూర్‌లో బోరు మోటర్లు ప్రారంభం



బోరు మోటరును ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-వర్ని(చందూర్)

మండల కేంద్రంలోని 7వ వార్డులో రెండు బోర్ మోటర్లను మాజీ ప్యాక్స్ చైర్మన్ అరికెల సాయరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో రాంరెడ్డి, సంజీవ్‌రెడ్డి, గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

కోటగిరి : మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శుక్రవారం జాతీయ ఉచిత గాలి కుంటు నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. కాగా గ్రామంలోని పశువులకు, ఆవులకు సీజనల్ వ్యాధుల నివారణకు టీకాలను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమ నిర్వహణను జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు డాక్టర్ జగన్నాథచారి ఆకస్మాత్తుగా పరిశీలించారు. పాడిపంటలు దేశానికి పట్టుకొమ్మలని, పాడిపంటలను జాగ్రత్తగా, ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకుని నిలబడితే, లక్షాధికారులు కావచ్చునన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట డాక్టర్ బాలిక్ అహ్మద్, ఏడీ డాక్టర్ బసవరెడ్డి, మండల పశువైద్యాధికారి డాక్టర్ సురేష్, మంజుల తదితరులు పాల్గొన్నారు.



కోటగిరి : టీకాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు

రెంజల్ : మండలంలోని దూపల్లి గ్రామంలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి టీకాలను వేసినట్లు పశు వైద్యాధికారి డాక్టర్ విట్టల్ శుక్రవారం తెలిపారు. గ్రామం లో మూడు టీంలను ఏర్పాటు చేసి సుమారు 500 పశువులకు ఈ టీకాలను వేసినట్లు ఆయన పేర్కొ న్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సిబ్బంది శశిరేఖ, భీమావు, నరేష్, గోపాల్ మిత్ర భాస్కర్ గౌడ్, సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.

మాక్లూర్ : మండలంలోని మదన్‌పల్లి గ్రామంలో పశు వైద్య, పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారులు కిరణ్ దేశ్‌పాండే, ఉమాను సహేర్ పాడిరైతుల వద్దకు వెళ్లి మూడు నెలలు పైబడిన పశువులన్నింటికీ టీకాలు వేయించాలని సూచించారు. ఈ సందర్భంగా 585 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎంపిటిసి గివురి ఒడ్డెన్న, గ్రామ ప్రత్యేక అధికారి పద్మ, పశు వైద్య సిబ్బంది విఎల్ఓ టి.వినిత, ఎండీ.అహ్మద్‌పాషా, గోపాలమిత్ర సభీర్, మహేశ్వరి, శ్రీనివాస్, గంగాధర్, లక్ష్మి పుష్ప పాల్గొన్నారు.



మాక్లూర్ : టీకాలు వేస్తున్న పశువైద్యాధికారి

ప్రజా పాలన దరఖాస్తుల కౌంటర్ పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన దరఖాస్తు కౌంటర్లను జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ శుక్రవారం సందర్శించారు. దరఖాస్తు ఫారాలలో తప్పులను సవరిస్తూ వారికి సహకరించాలన్నారు. మండలంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మండల పరిషత్ కార్యాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆయన అధికారులను సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శంకర్, సూపరింటెండెంట్ శ్రీనివాస్, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి క్రీడాకారుడు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఈనెల 14 నుంచి 16 వరకు ఆదిలాబాద్ జిల్లా నేరేడిగొండలో జరగనున్న 8వ రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు డిచ్‌పల్లి మండలంలోని మిట్టపల్లి పాఠశాల ఏడవ తరగతి విద్యార్థిని చేల్మిటి అమూల్య ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో పాల్గొంటున్న అమూల్యను పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుశీల్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు మర్కంటి గంగామోహన్, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

శ్రీ భాషిత పాఠశాలకు క్లాస్ సాతి వారి ఎక్సలెన్సీ అవార్డు

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలలో క్లాస్ సాతి స్టూడెంట్ లర్నింగ్ యాప్ శుక్రవారం విజయవంతంగా నిర్వహించబడుతుంది. ఈ యాప్ ద్వారా వెనకబడిన విద్యార్థులు విద్యా విషయాలు సులభంగా నేర్చుకోవడానికి అవగాహన, ఆసక్తిని నెలకొల్పడానికి దోహదపడుతుంది. ఈ సందర్భంగా ఇంచార్జ్ ఇస్మాల్ జాబి శ్రీ భాషిత పాఠశాలను సందర్శించి తరగతులను పర్యవేక్షించి ప్రశంసించారు. శ్రీ భాషిత పాఠశాల నిర్వహిస్తున్న తరగతులను మెచ్చుకొని సీఈవో పంకజ్ అగర్వాల్ తెలంగాణలోని క్లాస్ సాతి తరగతులను నిర్వహించడంలో ఒక గొప్ప పాఠశాలగా శ్రీ భాషితను అభివర్ణించారు. బెస్ట్ క్లాస్ స్వాతి ఆర్గనైజేషన్ అవార్డు ప్రశంసాపత్రాన్ని శ్రీ భాషిత పాఠశాల యాజమాన్యానికి బహుకరించారు. శ్రీ భాషిత పాఠశాల కరస్పాండెంట్ శ్రీ పోలపల్లి సుందర్, సీఈఓ పంకజ్ అగర్వాల్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఇటువంటి సువర్ణ అవకాశాలు శ్రీ భాషిత విద్యార్థులు ఎల్లప్పుడూ అందిపుచ్చుకోవాలని, శ్రీ భాషిత యాజమాన్యం మనస్ఫూర్తిగా కోరుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న దృశ్యం

మోపాల్ సొసైటీ చైర్మన్‌గా గంగారెడ్డి ఎన్నిక

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో గల సహకార సంఘం చైర్మన్‌గా గంగారెడ్డి శుక్రవారం ఎన్నికయ్యారు. గతంలో సొసైటీ చైర్మన్‌గా ఉన్న ఉమాపతి రాజీనామా చేయడంతో ఈ పదవి ఖాళీగా ఉంది. ఈ నేపథ్యంలో నూతన చైర్మన్ ఎన్నిక కోసం అసిస్టెంట్ రిజిస్టర్ మురళి పర్యవేక్షణలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముల్లంగి గ్రామానికి చెందిన డైరెక్టర్ గంగారెడ్డి ఒక్కరే చైర్మన్ పదవికి నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నికలు ఏకగ్రీవంగా ప్రకటించారు.



అక్రమ మొరం తరలిస్తున్న జేసీబీ, ఏడు ట్రాక్టర్లు సీజ్

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులోని బ్రాహ్మణ చెరువులో నుంచి అక్రమ మొరాన్ని తరలిస్తున్న జేసీబీ, ఏడు ట్రాక్టర్లను ట్రాస్కఫోర్స్, పోలీసు అధికారులు శుక్రవారం పట్టుకున్నారు. మొరం తవ్వకాలపై నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా టాస్క్‌ఫోర్స్, మండల పోలీసుల ఆధ్వర్యంలో అక్రమ మొరం తవ్వకాలపై దాడి నిర్వహించి ఒక జేసీబీతో పాటు ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.